1 St Year
Happy Work Anniversary.


షణ్ముఖ
RNI : APTEL / 2023 / 89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 2  సంచిక : 137  ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్  మంగళవారం 1 ఏప్రిల్ 2025 పేజీలు 8 : వెల 5/-  ఒంగోలు
VOLUME : 02 ISSUE : 137 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Tuesday 1 April 2025 PAGES : 8 PRICE : 5/-



## ఏపీ సర్కార్ కీలక ప్రకటన

**ఆ 51 మండలాలు.. కరువు**

**37 మండలాల్లో తీవ్రమైన కరువు ఉన్నట్లు ఉత్తర్వుల్లో వెల్లడి**

**14 మండలాల్లో కరువు ప్రభావం**

**అమరావతి**

గత ఏడాది ఏపీలో సాధారణ స్థాయిలో కూడా వర్షాలు పడలేదు.. అయితే గత జగన్ ప్రభుత్వం మాత్రం కరువు మండలాలను ప్రకటించడంలో నిర్లక్ష్యం చేసింది. మొక్కుబడిగా కరువు మండలాలను ప్రకటించి చేతులు దులుపుకుంది. రైతుల ఇబ్బందులను, స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకున్న కూటమి ప్రభుత్వం కరువు మండలాలపై దృష్టి సారించింది. ఇందులో భాగంగానే కరువు మండలాలపై కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ - మిగతా 3లో

## ఈసారి కడపలో మహానాడు

- ఉత్తమ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్
- కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని హామీ
- భిన్నాభిప్రాయాలు ఉన్నా అందరూ కలసికట్టుగా ముందుకుసాగాలని సూచన
- జూన్ నుంచి పార్టీ సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు
- 3సార్లు ఉత్తమ కార్యకర్త అవార్డు అందుకున్న ఆదిరెడ్డికి ప్రత్యేక అభినందన
- అలకలు వద్దు.. కష్టపడి పనిచేయండి
- ఇతర పార్టీ ఎమ్మెల్యే ఉన్నచోట సమన్వయ లోపం కారణంగా సమస్యలు వస్తున్నాయి



**యలమంచిలి/అనకాపల్లి**

యలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురంలో జరిగిన ఉత్తమ కార్యకర్తల సమావేశంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలపై జూన్ నుంచి ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పెన్షన్లు, అన్నక్యాంటీన్, స్టీల్ సిటీ, ఎన్టీపీసీ, బల్క్ డ్రగ్ పార్కు వంటి విజయగాధలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. చేసిన పనులు చెప్పుకోకపోతే ప్రత్యర్థులు చెప్పే అబద్ధాలు జనంలోకి వెళతాయని, ఈ విషయంలో పార్టీ కేడర్ అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... ఇటీవల నేను డిల్లీలో ఒక ఫంక్షన్ కు వెళ్లాను. అక్కడ మన సభ్యత్వం గురించే చర్చ జరుగుతోంది. మేం 5 లక్షలు కూడా చేయలేకపోతున్నాం, మీరు కోటి సభ్యత్వాలు ఎలా చేశారని అడిగారు. ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు హయాం నుంచి సభ్యత్వం మనకు ఒక ఎమోషన్. యలమంచిలి - మిగతా 3లో



### ప్రాణత్యాగానికైనా సిద్ధమే

- ఈద్ ప్రార్థనల్లో మమతా బెనర్జీ
- అల్లర్లను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి
- అలాంటి వారి ఉచ్చులో పడవద్దు
- బెంగాల్ ప్రభుత్వం మైనారిటీలకు అండగా నిలుస్తుంది
- రాష్ట్రంలోని మతసామరస్యాన్ని ఎవరూ దెబ్బతీయలేరు
- అన్ని మతాలను పరిరక్షించేందుకు ప్రాణత్యాగానికైనా సిద్ధం

## చట్టబద్ధపాలన లేదు

- ఏపీలో కక్ష రాజకీయాలకు బలవుతున్న బడుగు, బలహీన వర్గాలు
- "రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలమీద, నాయకులమీద దాడులు పరిపాటిగా మారాయి
- రక్షణ కల్పించాల్సిన పోలీసుల్లో కొందరు అధికారపార్టీ నాయకులతో కుమ్మక్కయ్యారు
- రాష్ట్రంలో వ్యక్తుల భద్రతకు భరోసా లేని పరిస్థితులు నెలకొన్నాయి



**గుంటూరు**

కూటమి పాలనలో రాజకీయ ఆధిపత్యం కోసం టీడీపీ చేస్తున్న అరాచకాలను, అఘాయిత్యాలను వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. మళ్లీ పగడ విప్పిన ఫ్యాక్షన్ రాజకీయానికి.. తాజాగా రాప్తాడులో బలైన వైఎస్సార్సీపీ కార్యకర్త కురుబ లింగమయ్య ఉదంతంపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. ఏపీలో చట్టబద్ధపాలన లేదు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలమీద, నాయకులమీద దాడులు పరిపాటిగా మారాయి. రక్షణ కల్పించాల్సిన పోలీసుల్లో కొందరు అధికారపార్టీ నాయకులతో కుమ్మక్కయ్యారు. రాష్ట్రంలో వ్యక్తుల భద్రతకు భరోసా లేని పరిస్థితులు నెలకొన్నాయి. బడుగు, బలహీన వర్గాల వారిని కక్ష రాజకీయాలకు బలిచేస్తున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారాయన. రామగిరి మండల ఉప ఎన్నికల్లో జరిగిన అరాచకాల వెనుక పోలీసుల వైఫల్యం తీవ్రంగా ఉంది. రామగిరిలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు టీడీపీ నేతల దౌర్జన్యాలతో భయభ్రాంతులకు గురై ఎన్నికలను బహిష్కరించారు. అయినా పోలీసులు అధికార పార్టీకి వంతపాడుతూ పైగా వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు కేసులు నమోదు చేయడం దుర్మార్గం. లింగమయ్య కుటుంబానికి అండగా.. .. కురబ లింగమయ్య హత్యను - మిగతా 3లో



### ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ ఎన్‌కౌంటర్

- వరంగల్ అగ్ర నేత రేణుక మృతి
- వారం రోజుల వ్యవధిలో ఇద్దరు అగ్రనేతల్ని కోల్పోయింది.
- దంతెవాడ జిల్లాలో మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య భీకర ఎదురుకాల్పులు
- ఆపరేషన్ కగార్ పేరిట హోం మంత్రి అమిత్ షా పర్యవేక్షణలో ఆపరేషన్

## సీఎం చంద్రబాబు మరో కీలక నిర్ణయం..

**కుప్పం గంగమ్మ టెంపుల్ పాలకమండలి ఆలయ కమిటీ నియామకం**


**చైర్మన్‌తో కలిపి 11 మందితో కమిటీని ఏర్పాటు**

**బీఎంకే రవిచంద్ర బాబు చైర్మన్‌గా, మరో 10 మందిని సభ్యులు**

**చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో ముఖ్యమైన టెంపుల్ కావడంతో స్వయంగా కమిటీని ఎంపిక చేశారు.**

**చిత్తూరు**

కుప్పం గంగమ్మ టెంపుల్ పాలకమండలి కమిటీని సీఎం చంద్రబాబు నియమించారు. చైర్మన్‌తో కలిపి 11 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. బీఎంకే రవిచంద్ర బాబు చైర్మన్‌గా, మరో 10 మందిని సభ్యులుగా నియమించారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో రెండేళ్ల పాటు కుప్పంలో రవిచంద్ర అన్నా క్యాంటీన్‌ను నిర్వహించారు. గత జగన్ ప్రభుత్వ దాష్టీకాలను ఎదిరించి అన్నా క్యాంటీన్‌ను రవిచంద్ర నిర్వహించారు. చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో ముఖ్యమైన టెంపుల్ కావడంతో - మిగతా 3లో



## అక్రమ మైనింగ్ కేసులో కాకాని అరెస్టు?



- బెయిల్ రాకుండా.. కాకాణిపై కూటమి ప్రభుత్వం కుట్ర
- నెల్లూరులో కార్యకర్తలతో అందుబాటులో ఉన్నన్ని పోలీసులు నోటీసులు ఇవ్వని పోలీసులు..
- ప్రధాన అనుచరుడు పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి ఈ కేసులో ఏ వన్ ముద్దాయి

**నెల్లూరు**

సర్వేపల్లి నియోజకవర్గం తాటిపర్తి గ్రామంలో అక్రమ మైనింగ్ కేసులో మాజీ మంత్రి, వైఎస్ఆర్సిపి జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకాని గోవర్ధన్ రెడ్డికి నోటీసులు జారీజైపోగా ఆయన లేకపోవడంతో ఆయన ఇంటికి నెల్లూరులోనూ, హైదరాబాదులోనూ అంటించారు, ఆయన ప్రధాన అనుచరుడు పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి ఈ కేసులో ఏ వన్ ముద్దాయిగా నెల్లూరు పోలీసులు చేర్చారు. కానీ ఆయన అప్రూవల్ గా మార్గంతో తెలుగుదేశం నాయకులకు అక్రమ మైనింగ్ - మిగతా 3లో

## 2029లోనూ మోదీనే ప్రధాని

- "మోదీనే మా నేత. అలాగే ఆయన కొనసాగుతారు
- మన సంస్కృతిలో తండ్రి బతికుండగా వారసుని గురించి మాట్లాడం.
- మోదీకి వారసుడిని అన్వేషించాల్సిన అవసరమే లేదు
- మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్



# ఈసారి కడపలో మహానాడు

-మొదటిపేజీ తరువాయి

నియోజకవర్గంలో 41 వేల సభ్యత్వాలు నమోదు చేసినందుకు అభినందనలు. యువగళం పాదయాత్రలో కష్టపడిన కార్యకర్తలను గుర్తించాలని ఇక్కడ కార్యకర్తలు నాకు చెప్పారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ, సోషల్ మీడియా, సభ్యత్వ నమోదులో మెరుగైన పనితీరు కనబర్చిన వారి వివరాలను ఆన్ లైన్ లో పెట్టా. ఎవరు పనిచేస్తున్నారో తెలుసుకునేందుకు ఈ విధానం అమలుచేస్తున్నాం. టీడీపీలో కష్టపడిన కార్యకర్తలకే నామినేటెడ్ పదవులు ఇస్తాం. ఈ విషయంలో క్లారిటీతో ఉన్నాం. కష్టపడి పార్టీకోసం పనిచేయండి. ప్రస్తుత మన ప్రభుత్వం ఐదేళ్లు ఉంటుంది. తొలిసారి అవకాశం రాకపోయినా మూడు విడతల్లో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం. అధైర్యపడవద్దు అని లోకేశ్ చెప్పారు.

**అలకలు మాని పార్టీ కోసం పనిచేయండి...**

మే తర్వాత కేడర్ అంతా ప్రజల్లోకి వెళ్లాలి. మే నెలలో కడపలో మహానాడు నిర్వహించబోతున్నాం. ఈలోగా కుటుంబ సాధికార సమితులు, బూత్, క్లస్టర్ కమిటీలు, అనుబంధ సంఘాలు, జిల్లా కమిటీల నియమకాన్ని పూర్తి చేస్తాం. మహానాడులో జాతీయ అధ్యక్షుడి ఎన్నిక తర్వాత రాష్ట్ర కమిటీ నియమాకం చేపడతాం. పార్టీ కేడర్ అంతా ప్రతి 3 నెలలకు ఒకసారి ప్రజల్లోకి వెళ్లాలి. జగన్ పై కంటే పార్టీ కార్యకర్తల కోసమే నేను ఎక్కువగా పోరాడుతుంటాను. సమస్యలపై నిర్ణయం తీసుకునే వరకు అందరం కూర్చుని చర్చిద్దాం. ఒకసారి నిర్ణయం తీసుకున్నాక అందరం కలిసి పనిచేయాల్సిందే. అలకలుమాని నమ్ముకున్న సిద్ధాంతం కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలి.

**ఇకపై నిరంతరం యువరక్తం ఎక్కిస్తాం...**

ఇకపై పార్టీలో నిరంతరం యువరక్తం నింపాలని నిర్ణయించాం. యువత రాజకీయాల్లోకి రావాలి. ఏ నాయకుడు కూడా ఒకే పదవిలో మూడుసార్లకు మించి ఉండకూడదని ప్రతిపాదిస్తున్నాం. గ్రామస్థాయి అధ్యక్షుడికి కూడా పొలిట్ బ్యూరోలో స్థానం లభించే పరిస్థితి రావాలి. పార్టీలో కరడుగట్టిన కార్యకర్తలంతా అయిదేళ్లు నరకం అనుభవించారు. ఎన్నో కేసులుపెట్టి హింసించారు. హోంమంత్రి అనితపై కూడా 23 కేసులు ఉన్నాయి. పాదయాత్ర సమయంలో పోలీసులు నాకు సెక్యూరిటీ అడిగితే ఇవ్వలేదు. ఇప్పుడు వద్దంటే వస్తున్నారు. రామతీర్థం వెళ్లడానికి బాబు గారు విశాఖ ఎయిర్ పోర్టుకు వస్తే రోడ్డుకు అడ్డుగా పొక్లయినర్లు పెట్టారు. పాదయాత్ర సమయంలో నా స్టూల్, మైక్ లాక్కున్నారు. ఈరోజు టైం బాగుంది కదా అని గతాన్ని మర్చిపోవద్దు. కుటుంబంలో మాదిరి పార్టీలో కూడా భిన్నాభిప్రాయాలు ఉంటాయి. పరిష్కరించుకొని ముందుకు సాగాలి.

**ఓర్పు, సహనంతో ప్రజల్లోకి వెళ్లండి...**

తెలుగుదేశం పార్టీలో కార్యకర్తే ఫస్ట్. కేడర్ కార్యాలయాలకు వెళ్లి చట్టపరంగా పరిష్కరించరించగలిగిన సమస్యలను స్థానికంగా పరిష్కరించేందుకు చొరవచూపాలి. మే నెల నుంచి ప్రతిరోజూ 300 మందికి చొప్పున పార్టీ కేడర్ కు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తాం. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించుకోవాలి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు అయింది. మరో రెండు నెలల్లో మహానాడు నిర్వహించుకోబోతున్నాం. ఇతర పార్టీ ఎమ్మెల్యే ఉన్నచోట సమన్వయ లోపం కారణంగా సమస్యలు వస్తున్నాయి. ఎమ్మెల్యే లేనిచోట అక్కడ ఇన్ చార్జి ప్రతి వారం కూర్చుని మాట్లాడుకోవాలి. చట్టపరిధిలోని పనుల కోసం కార్యకర్తలు కార్యాలయాలకు వెళితే పనులు చేయాల్సిందే. ఓర్పు, సహనంతో ప్రజల్లోకి వెళ్లాలి అని మంత్రి లోకేశ్ కార్యకర్తలను కోరారు. ఈ సందర్భంగా ఉత్తమ కార్యకర్తలను మంత్రి అభినందించారు. సభ్యత్వం, మన టీడీపీ, భవిష్యత్తుకు గ్యారంటీ వంటి అంశాల్లో అవార్డు అందుకున్న ధర్మాల ఆదిరెడ్డి అనే కార్యకర్తను ప్రత్యేకంగా అభినందించారు.

**తప్పుడు కేసుల ఎత్తివేతకు చర్యలు తీసుకుంటాం...**

ఈ సమావేశంలో పలు సమస్యలను కార్యకర్తలు మంత్రి లోకేశ్ దృష్టికి తెచ్చారు. వైసీపీ సర్పంచ్ లతో పాటు 10 శాతం వైసీపీ వారు కూడా టీడీపీ సభ్యత్వ కార్డులు తీసుకున్నారని తెలిపారు. అచ్యుతాపురం సెజ్ కు సంబంధించి ఆర్ అండ్ ఆర్ లో ఇంకా 200 మందికి స్థలాలు ఇవ్వలేదని, ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. పూడిమడకలో ఫిషింగ్ హార్బర్ నిర్మించాలని విన్నవించారు. ఉపాధి హామీ, నీరు-చెట్టు బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్యకర్తలపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలని కోరారు. ఉపాధి హామీ, నీరు-చెట్టు బిల్లులు, తప్పుడు కేసులకు సంబంధించి పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక విభాగాన్ని సంప్రదించాలని మంత్రి లోకేశ్ కార్యకర్తలను సూచించారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ దామచర్ల సత్య, యలమంచిలి నియోజకవర్గ టీడీపీ ఇన్ చార్జి ప్రగడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**అలకలు వద్దు.. కష్టపడి పనిచేయండి**

అందరం కలిసి పోరాడి ఆంధ్రప్రదేశ్‌లో చరిత్ర తిరిగి రాశామని..164 స్థానాలు కైవసం చేసుకున్నామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి , మంత్రి నారా లోకేష్ అన్నారు. సోమవారం యలమంచిలి నియోజకవర్గంలో కార్యకర్తలు, నేతలతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. జూన్ నుంచి మనం సాధించిన విజయాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. భిన్నాభిప్రాయాలు ఉన్నా అందరూ కలసికట్టుగా ముందుకు సాగాలన్నారు. తెలుగుదేశం పార్టీలో కార్యకర్తకే అగ్రతాంబూలమని, ఆ తర్వాతే ఎవరైనా అని స్పష్టం చేశారు. తొలిసారి అవకాశం రాకపోయినా మూడు విడతల్లో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని, అధైర్యపడవద్దని హామీ ఇచ్చారు. అలకలుమాని పార్టీ కోసం పని చేయాలని కోరారు.

మే తర్వాత కేడర్ అంతా ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. మే నెలలో కడపలో మహానాడు నిర్వహించబోతున్నామని తెలిపారు. మహానాడులో జాతీయ అధ్యక్షుడి ఎన్నిక తర్వాత రాష్ట్ర కమిటీ నియమాకం చేపడతామన్నారు. పార్టీ కేడర్ అంతా ప్రతీ మూడు నెలలకు ఒకసారి ప్రజల్లోకి వెళ్లాలన్నారు. జగన్ పై కంటే పార్టీ కార్యకర్తల కోసమే తాను ఎక్కువగా పోరాడుతుంటానని వెల్లడించారు. ఇకపై నిరంతరం యువరక్తం ఎక్కిస్తామన్నారు. ఏ నాయకుడు కూడా ఒకే పదవిలో మూడుసార్లకు మించి ఉండకూడదని ప్రతిపాదిస్తున్నామన్నారు. గ్రామస్థాయి అధ్యక్షుడికి కూడా పొలిట్‌బ్యూరోలో స్థానం లభించే పరిస్థితి రావాలని తెలిపారు. పార్టీలో కరుడుగట్టిన కార్యకర్తలంతా అయిదేళ్లు నరకం అనుభవించారని.. ఎన్నో కేసులుపెట్టి హింసించారన్నారు.

ఇతర పార్టీ ఎమ్మెల్యే ఉన్నచోట సమన్వయ లోపం కారణంగా సమస్యలు వస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే లేనిచోట అక్కడ ఇన్‌చార్జి ప్రతివారం కూర్చుని మాట్లాడుకోవాలని సూచించారు. చట్టపరిధిలోని పనుల కోసం కార్యకర్తలు కార్యాలయాలకు వెళితే పనులు చేయాల్సిందే అని తెలిపారు. తప్పుడు కేసుల ఎత్తివేతకు చర్యలు తీసుకుంటామన్నారు. వైసీపీ సర్పంచ్‌లతో పాటు 10 శాతం వైసీపీ వారు కూడా టీడీపీ సభ్యత్వ కార్డులు తీసుకున్నారని అన్నారు. తప్పుడు కేసులకు సంబంధించి పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక విభాగాన్ని సంప్రదించాలని మంత్రి లోకేష్ తెలిపారు.

ఏపీ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఇవాళ అనకాపల్లి జిల్లాలో పర్యటించారు. ఎలమంచిలి నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

చంద్రబాబు 35 ఏళ్ల కిందట హెరిటేజ్ అనే విత్తనం నాటారని, మా ఖర్చుల కోసం మేం రాజకీయాలపై ఆధారపడం అని స్పష్టం చేశారు. కార్యకర్తలకు ఉపాధి కల్పించాలని, వారు తమ సొంత కాళ్లపై నిలబడాలని చంద్రబాబు అంటుంటారని లోకేశ్ గుర్తుచేశారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముకలాంటివారని, వారికి ప్రమాద బీమా మరింత పెంచుతామని స్పష్టం చేశారు.

చిన్న చిన్న మనస్పర్థలు వచ్చాయని అలగడం మంచిది కాదని నేతలు, కార్యకర్తలకు హితవు పలికారు. పార్టీలో విభేదాలకు ఫుల్ స్టాప్ పెట్టాలని, కలిసి పనిచేయాలని సూచించారు. తిట్టుకుందాం, కొట్టుకుందాం... కానీ విడాకులు అవుటాఫ్ క్వశ్చన్ అంటూ వ్యాఖ్యానించారు. పార్టీలో నేనే నిరంతరం పోరాడుతుంటాను... పార్టీలో సంస్కరణలు తీసుకురావాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నాను అని వివరించారు. తప్పు అనిపిస్తే ఆఖరికి నన్నయినా నిలదీయొచ్చు... టీడీపీ అంటేనే కార్యకర్తల పార్టీ అని లోకేశ్ ఉద్ఘాటించారు. "చంద్రబాబు అరెస్ట్ బాధ నాలో ఇంకా ఉంది. మంచి రోజులు వచ్చాయని కష్ట కాలాన్ని మర్చిపోకూడదు. కూటమి ధర్మాన్ని నాయకులు, కార్యకర్తలు అందరూ పాటించాలి" అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

# అక్రమ మైనింగ్ కేసులో కాకాని అరెస్టు?

-మొదటిపేజీ తరువాయి

కేసు గురించి పూర్తి సమాచారం ఇస్తున్నట్లు వైఎస్ఆర్సిపి నాయకులు ఆరోపణ. దీనిపై కాకాని గోవర్ధన్ రెడ్డిని రెండు మూడు రోజుల లోపల పోలీసులు అరెస్టు చేస్తారని అటు వైఎస్సార్సీపీలో, ఇటు వైఎస్ఆర్సిపి పార్టీ వర్గాల్లో ఎక్కడ పట్టిన అదే మాట వినిపిస్తుంది. ఇప్పటికే ఆయన ప్రత్యేకించి సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, అతని అనుచరులు కాకాని గోవర్ధన్ రెడ్డి పై పలు స్టేషన్లో పలు అక్రమాలపై ఫిర్యాదులు చేయడం జరిగింది. ఈ ఫిర్యాదుల విషయం అటు ఉంటే ఖచ్చితంగా ఈ కేసు విషయంలో కాకాని గోవర్ధన్ రెడ్డి అరెస్ట్ అవుతారని చర్చ జరుగుతోంది, ఏది ఏమైనా అప్పటికి దీనిపై ముందస్తుబేలుగా హైకోర్టులో కాకాని గోవర్ధన్ రెడ్డి జుట్టు వేయడం జరిగింది. అది మంగళవారం జడ్జిమెంట్ ఇవ్వనున్నారు. తదుపరి జడ్జిమెంట్ ప్రకారం కాకాని గోవర్ధన్ రెడ్డి అరెస్ట్ అవుతారా అన్న సమాచారం జిల్లాలో ప్రతి ఒక్కరు నోటా వినబడుతుంది. ఏది ఏమైనప్పటికీ హైకోర్టు తీర్పు ప్రకారం కాకాని భవిష్యత్తు తేలలు ఉంది.

బెయిల్ రాకుండా..


మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి బెయిల్ రాకుండా ఉండేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తుందా?. నెల్లూరులో కార్యకర్తలతో అందుబాటులో ఉన్నన్ని పోలీసులు నోటీసులు ఇవ్వని పోలీసులు.. కాకాణి హైదరాబాద్‌కు వెళ్లిన వెంటనే నోటీసులు ఎలా ఇస్తారు?. బెయిల్ పిటిషన్‌పై వాదనలు జరగడానికి ఒకరోజు ముందు విచారణకు హాజరుకావాలని పోలీసులు చెప్పడం వంటి పరిణామాలు చూస్తుంటే అవుననే అనిపిస్తోందని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆరోపిస్తున్నారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి నెల్లూరులోని తన



నివాసంలో కార్యకర్తలతో నాలుగైదు రోజులు అందుబాటులో ఉన్నారు. అందుబాటులో ఉన్నన్ని రోజులు పోలీసులు నోటీసులు ఇవ్వలేదు. అయితే, ఉగాది పండుగ పర్వదినాన హైదరాబాద్‌లో ఉన్న తన కుటుంబసభ్యులతో గడిపేందుకు వెళ్లారు. కాకాణి నెల్లూరులో లేరని తెలుసుకుని హుటాహుటీనా నివాసానికి వెళ్లి నోటీసులు అంటించారు. ఉగాది రోజు సాయంత్రం ఆరుగంటల సమయంలో కాకాణి నివాసానికి నోటీసులు అంటించారు. దీనిపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు మండిపడుతున్నారు. మంగళవారం కాకాణి గోవర్ధన్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై వాదనలు జరగనున్నాయి. ఈనేపథ్యంలో సోమవారం ఉదయం 11గంటలకు విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. కాకాణినికి బెయిల్ రాకుండా అడ్డుకునేందుకు పోలీసులు కుట్రలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# ప్రవీణ్ మృతిపై అనుమానాలు

**కాకినాడ :** పాస్టర్ ప్రవీణ్ పగడాల ఎలా చనిపోయారనే ఉత్కంఠ నడుస్తోంది. ప్రమాదమా? చంపేశారా? అనుకోకుండా జరిగిందా? పక్కా ప్లాన్డ్‌గా లేపేశారా? ఇది వాళ్ల పనేనా? ఇలా రకరకాల చర్చలు. ప్రవీణ్ ఒంటిపై గాయాలు ఎలా అయ్యాయి? దాడి చేసి కొట్టారా? కిందపడి గాయపడ్డాడా? బైక్ హెడ్‌లైట్ ఏమైంది? పక్కనుంచి వేగంగా వెళ్లిన ఆ రెడ్ కార్ ఎవరిది? ఇలా మీడియాలో గంటల తరబడి డిబేట్లు. వీ వాంట్ జస్టిస్ అంటూ క్రైస్తవ సంఘాల ఆందోళన. వేలాదిగా ఉన్న ప్రవీణ్ అనుచరుల్లో ఆగ్రహావేశాలు. సంయమనం పాటించాలని అన్నివర్గాల సూచనలు. ఇలాంటి ఉద్రిక్త వాతావరణంలో.. ప్రవీణ్ పగడాల మృతిపై ఏలూరు ఐజీ అశోక్ కుమార్ పెట్టిన ప్రెస్‌మీట్‌తో ఫుల్ క్లారిటీ వస్తుందని అంతా ఆతృతగా చూశారు. మీడియా సమావేశం అయితే పెట్టారు కానీ.. అందులో ఇచ్చిన స్పష్టత ఏమీ లేదు. ప్రవీణ్ ఎలా చనిపోయారో పోలీసులు చెప్పలేక పోయారు. పాస్టర్ మరణానికి కారణం ఏంటో



పసిగట్టలేక పోయారు. పైగా విజయవాడలో ఆ 4 గంటలు ఏం చేశాడు? ఆయన ఒంటిపై గాయాలు ఎలా అయ్యాయి? బుల్లెట్ బండి ఎలా పడింది? అంటూ మరిన్ని డౌట్స్ క్రియేట్ చేసేలా చేసింది. ప్రవీణ్ డెత్ మిస్టరీ ఇప్పటికీ అలానే కంటిన్యూ అవుతోంది.

## ఏపీ సర్కార్ కీలక ప్రకటన..

-మొదటిపేజీ తరువాయి

ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు.

**ఆ నివేదిక ఆధారంగా..**

ఏపీలో కరువు మండలాలుగా 51 మండలాలను ప్రకటించారు. 37 మండలాల్లో తీవ్రమైన కరువు ఉన్నట్లు ఉత్తర్వుల్లో వెల్లడించారు. 14 మండలాల్లో కరువు ప్రభావం ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు రబీ సీజన్ 2024-25 కరువు మండలాలను వెల్లడిస్తూ ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల రాష్ట్ర విపత్తుల నిర్వహణ కార్యాలయంలో నిర్వహించిన కరువు ప్రభావ కమిటీ సమావేశంలో జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖలు సమర్పించిన నివేదికలను కరువు ప్రభావ కమిటీ నిశితంగా పరిశీలించింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన నివేదికలను తాము దృష్టిలో ఉంచుకుని, వర్షపాతం లోటు, పంటల నష్టం, భూగర్భ జలాల స్థాయి, వ్యవసాయ స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని సిసోడియా ప్రకటించారు.

## సీఎం చంద్రబాబు మరో కీలక నిర్ణయం..

-మొదటిపేజీ తరువాయి

స్వయంగా కమిటీని ఎంపిక చేశారు. గత వైసీపీ ప్రభుత్వం గంగమ్మ టెంపుల్ కమిటీ పదవులనూ వివాదంలోకి నెట్టింది. దేవాలయం పవిత్రత, ప్రతిష్టత పెంచేలా కమిటీ ఉండాలని సీఎం చంద్రబాబు ఆలోచన చేశారు. దీనిలో భాగంగా స్వయంగా కమిటీని ఎంపిక చేశారు. ఒకటి రెండు రోజుల్లో అధికారికంగా ఉత్తర్వులు వెలువడనున్నాయి. కొత్త కమిటీలో పదిమంది సభ్యుల్లో సామాజిక సమతుల్యతకు సీఎం చంద్రబాబు ప్రాధాన్యం ఇచ్చారు. సభ్యులుగా శారదమ్మ, నరేష్, సింధూ రాజకుమార్, మంజుల మణి, సంతోషమ్మ జయరామ నాయుడు, ఎస్ .మహేష్ ,ఎన్. వినాయకన్, వీణల శరవణన, వి ఏ.లక్ష్మి, జ్యోతిష్‌లను నియమించారు.

## చట్టబద్ధపాలన లేదు

-మొదటిపేజీ తరువాయి

ఖండిస్తున్నా. అధికారపార్టీ అన్యాయాలను ప్రశ్నించినందుకు.. వారి దాడులను వ్యతిరేకించినందుకు వైఎస్సార్‌సీపీకి చెందిన ఓ బీసీ కార్యకర్తను టీడీపీ నాయకులు పొట్టనపెట్టుకున్నారు. అధికార పార్టీ నేతల దారుణాలను అడ్డుకోవడంలో.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో వైఫల్యం కారణంగానే ఈ ఘటన జరిగింది. కురుబ లింగమయ్య కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. లింగమయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది" అని వైఎస్ జగన్ అన్నారు.

## కొడాలి నానికి తీవ్ర అస్వస్థత

**నాలుగు వాల్వుల్లో మూడు మూసుకుపోవడంతో క్లిష్టం**

**విజయవాడ :** వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కొడాలి నానిని అత్యవసరంగా ముంబైకి తరలించారు. హైదరాబాద్ నుంచి ఎయిర్ అంబులెన్స్ లో ఆయనను ముంబైలోని బ్రీచ్ క్యాండి ఆస్పత్రికి తరలించారు. కొడాలి నాని గుండెలో మూడు వాల్వ్‌లు మూసుకుపోవడంతో ఆయనకు అత్యవసరం చికిత్స చేయాల్సి ఉంది. ఆ మూడు వాల్వ్‌లకు స్టంట్స్ వేయాలా లేకపోతే బైపాస్ సర్జరీ చేయాలా అన్నది వైద్యులు నిర్ణయించనున్నారు. ముంబైలోని గుండె వైద్య నిపుణులు రమాకాంత్ పాండేతో కొడాలి నానికి ఆపరేషన్ చేయించాలని కుటుంబసభ్యులు నిర్ణయించారు. కొడాలి నాని వారం రోజుల కిందట గుండెల్లో మంటగా అనిపించడంతో ఆస్పత్రిలో చేరారు. అయితే ఆయన టీం మాత్రం కొడాలి నానికి గుండెపోటు రాలేదని కేవలం గ్యాస్ట్రిక్ సమస్య వల్లనే ఆస్పత్రిలో చేరారని.. టెస్టుల తర్వాత డిశ్చార్జ్ అవుతారని ప్రకటించారు. అయితే ఆయన డిశ్చార్జ్ కాలేదు. గుండెల్లో మూడు వాల్వ్ లు పూడుకుపోవడం తో ఏదో ఒకటి చేయాల్సిందేనని వైద్యులు చెప్పడంతో ఆపరేషన్ కు సిద్ధమయ్యారు. ఎంత ఖర్చు అయినా పర్వాలేదని ఆపరేషన్ సక్సెస్ కావడం ముఖ్యమని భావిస్తున్నారు. కొడాలి నాని వ్యక్తిగత ఆహారపు అలవాట్ల వల్ల.. ఆపరేషన్ కు ఆయన శరీరం సహకరించే స్థితికి ముందుగా తీసుకు రావాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. గుండెపోటుతో ఆస్పత్రిలో చేరిన కొడాలి నానికి అనేక సమస్యలు ఉన్నట్లుగా పరీక్షల్లో తేలినట్లుగా చెబుతున్నారు. గుండెలో ఉండే 4 వాల్వ్ లలో 3 నాళాలు పూడుకుపోయాయి. అప్పుడే కిడ్నీ సమస్యలు కూడా బయట పడడం జరిగిందని కుటుంబసభ్యులు చెబుతున్నారు. గుండెలో మూడు వాల్వ్‌లు పని చేయకపోవడం అత్యంత ప్రమాదకరం. అందుకే అత్యవసరంగా చికిత్స చేయాలని నిర్ణయించారు. కిడ్నీ సమస్యల కారణంగా ఆపరేషన్ క్లిష్టంగా మారినట్లుగా భావిస్తున్నారు. ముంబైలో మెరుగైన వైద్య సదుపాయాలతో పాటు.. నిపుణులైన వైద్యులు ఉంటారని.. గుండె ఆపరేషన్ ను కిడ్నీ సైతం తట్టుకునేలా చేసి.. సక్సెస్ చేస్తారని అంటున్నారు. ఈ క్రమంలో ఆయనకు ప్రత్యేక విమానంలో ముంబైకి తరలించాలని నిర్ణయించారు. ఆయనతో పాటు ఎనిమిది మంది కుటుంబసభ్యులు కూడా ముంబైకి వెళ్లారు. కొడాలి నాని వయసు 53 ఏళ్లు మాత్రమే. అయితే ఆయన వ్యక్తిగత ఆహారపు అలవాట్లు కారణంగా గుండెకు, కిడ్నికి సమస్యలు వచ్చినట్లుగా అనుమానిస్తున్నారు. మొదట్లో జూనియర్ ఎన్టీఆర్ కు సన్నిహితుడిగా ఉండేవారు. జూ.ఎన్టీఆర్ హీరో అయిన తర్వాత ఆయనతో ఒకటి రెండు సినిమాలు తీశారు. నందమూరి హరికృష్ణతో సన్నిహితంగా ఉండేవారు. ఎన్టీఆర్ సిఫారసుతోనే ఆయన గుడివాడ టీడీపీ టిక్కెట్ దక్కించుకున్నారు. అయితే తర్వాత టీడీపీ నుంచి బయటకు వచ్చి ఆయన చంద్రబాబును.. ఆయన కుటుంబాన్ని ఘోరంగా తిట్టడం ప్రారంభించారు. దాంతో ఆయన టీడీపీ క్యాడర్‌కు బద్ధశత్రువుగా మారారు

## అమరావతిలో చంద్రబాబు సొంత ఇల్లు

**9న శంకుస్థాపన**



**విజయవాడ :** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అమరావతిలో భూమి కొనుగోలు చేశారు. వెలగపూడికి సమీపంలో ఇ-6 రోడ్ లో ఐదు ఎకరాల భూమిని ఆయన కొంతకాలం క్రితం కొన్నారు. ఏప్రిల్ 9న అక్కడ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేయబోతున్నారు. ఏప్రిల్ 15 తర్వాత అమరావతి పనుల నిర్మాణానికి సంబంధించిన పనులు ప్రారంభం కాబోతున్నాయి. ఆరేళ్లగా ఆగిపోయిన ఈ పనులకు ప్రధాని మోదీ మరోసారి శంకుస్థాపన చేయబోతున్నారు. దానికంటే ముందుగానే తన సొంత ఇంటి నిర్మాణానికి భూమి పూజ జరిపించాలని చంద్రబాబు భావిస్తున్నారు. రాష్ట్ర విభజన జరిగినప్పటి నుంచి చంద్రబాబుపై విపక్షాలు ఎక్కుపెట్టిన ప్రధానమైన విమర్శ ఆయనకు అమరావతిలో సొంత ఇల్లు లేదని. ప్రస్తుతం ఆయన ఉంటున్న ఉండవల్లిలోని నివాసం పారిశ్రామికవేత్త లింగమనేని రమేష్‌కు చెందినదని వారి ఆరోపణ. అదే సమయంలో వైసీపీ అధ్యక్షుడు తాడేపల్లిలో తన సొంత ఇల్లు నిర్మాణం చేశారు. 2019కి ముందే గృహప్రవేశ కార్యక్రమం కూడా పూర్తి చేశారు. అప్పట్లో వైసిపి ఇదే అంశాన్ని హైలైట్ చేస్తూ అమరావతిలో చంద్రబాబుకు సొంతిల్లు లేదనీ హైదరాబాదులోనే నివాసం ఉంటూ ఇక్కడ రాజకీయాలు నడిపిస్తున్నారంటూ చంద్రబాబును విమర్శించేవారు. 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చాక ప్రస్తుతం చంద్రబాబు నివాసం ఉంటున్న ఉండవల్లి ఇంటిని ముఖ్యమంత్రి నివాసంగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా వెలగపూడి లోని సెక్రటేరియట్ వెనకాల ఐదు ఎకరాల 20 సెంట్ల భూమిని కొనుగోలు చేశారు. ఎమి కాలేజీకి దగ్గర్లో ఉన్న ఈ స్థలంలో చంద్రబాబు ఇంటికి సంబంధించిన నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 9న భూమి పూజ చేయడానికి ముహూర్తం నిర్ణయించినట్టు తెలుస్తుంది. ఇప్పటికే ఇంజనీర్లు ఆ స్థలంలోని మట్టిని పరీక్ష చేశారు. అక్కడ ఇంటి నిర్మాణానికి అనువుగా ఉంటుందా లేదా అనే టెస్టులు కూడా పూర్తయ్యాయి. వెలగపూడి సచివాలయానికి, ఎమి కాలేజీకి, హైకోర్టు మధ్యలో ఉన్న ఈ స్థలం అమరావతి కోర్ క్యాపిటల్‌కి సెంటర్‌గా ఉండబోతుంది. దానితో ఈ ఏరియా రూపు రేఖలే మారిపోతాయని స్థానికులు అంటున్నారు. ఏకంగా ఏపీ ముఖ్యమంత్రి తన సొంత ఇంటి కోసం తమ స్థలాల మధ్యలోనే కొంత ఏరియాను కొనడం అక్కడ ఆయన నివాసం రావడం వల్ల రియల్ ఎస్టేట్‌పరంగా కూడా తమ భూములకు మంచి రెట్లు వస్తాయని స్థానిక గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
3 | 01.04.25
మంగళవారం



## పవిత్రతకు, త్యాగానికి, మత సామరస్యానికి ప్రతీక రంజాన్

ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడిన కూటమి ప్రభుత్వం

కొండపిలో ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేసిన మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

4

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# కార్గోనా మజాకా....!

ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్న ఆర్టీసి కార్గో సిబ్బంది
పండుగ రోజున ఆవేదనకు గురైన ముస్లిం సోదరుడు
పార్శిల్ చేసిన బట్టలను చేపల బాక్సుతో జత చేసిన వైనం
పొదిలికి చేరుకునే సరికి తెల్లబట్టలు నల్లబట్టలుగా మార్పు
తమకేం సంబంధం లేదన్న పొదిలి కార్గో సిబ్బంది
ఒంగోలు కార్గో సిబ్బంది నిర్లక్ష్యానికి రూ.5 వేలు వృధా
చోద్యం చూస్తున్న ఆర్టీసి ఉన్నతాధికారులు
వినియోగదారుల ఫోరంను ఆశ్రయించనున్న బాధితుడు

**(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, మార్చి 31)**

కార్గో అంటేనే నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుంది....ఎన్ని సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా కార్గో సిబ్బంది నిర్లక్ష్యానికి అడ్డుకట్ట వేసిన అధికారులు లేరని చెప్పడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఒంగోలు ఆర్టీసి కార్గో పార్శిల్ సర్వీస్ సిబ్బంది ఇష్టం వచ్చినట్లు వినియోగదారులతో వ్యవహరించడం పరిపాటి. ఏదైనా వస్తువు గురించి అడిగితే కనీస గౌరవ సమాధానం కరువు. మీకు దిక్కున్నచోట చెప్పుకోండి అని చెప్పడం వారి వంతు అవుతుంది. తమను ఎవరూ ఏమి చేయలేరనే ధీమా వారిలో స్పష్టంగా కనిపిస్తుంది. ప్రతి వినియోగదారుడికి సౌకర్యవంతంగా ఉండేందుకు ఆర్టీసిలో ఈ కార్గో సర్వీస్‌ను ప్రారంభించారు. కానీ రోజు రోజుకు కార్గో పార్శిల్ సర్వీస్ సిబ్బంది వ్యవహారం ముదురుతోంది. తమను ప్రశ్నించే హక్కు ఎవరికి లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. పొదిలికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి షేక్ జిలాని రంజాన్ పండుగ సందర్భంగా కొద్ది రోజుల క్రితం ఒంగోలులో ఓ టైలర్ షాపుకు వెళ్ళి తన బట్టలు కుట్టి పొదిలి లో నివసిస్తున్న తనకు అందించాలని కోరారు. ఒక్కో షర్టు బిట్‌ను రూ.2,000 పై చిలుకు ఖరీదు చేసే రెండు షర్ట్ బిట్‌లను (రూ.4,000) కొనుగోలు చేసి టైలర్‌కు అందించారు. సదరు టైలర్ ఆ బట్టలను కుట్టి సోమవారం పండుగ కావడంతో ఒంగోలు ఆర్టీసి బస్టాండ్‌లో కార్గో పార్శిల్ నందు పార్శిల్ నెం. 64681613 నెంబర్‌తో టైలర్ ఓ కవర్‌లో ప్యాకింగ్ చేసి పార్శిల్‌ను కార్గో సిబ్బంది ప్రత్యేకంగా నూతన బట్టలు పార్శిల్ చేసి ఇచ్చాను అని చెప్పారు. అయితే ఇక్కడ వరకు బాగానే ఉంది. ఇక్కడే మన ఒంగోలు ఆర్టీసి కార్గో పార్శిల్ సర్వీస్ సిబ్బంది నిర్వాకం బహిర్గతమైంది. పార్శిల్ బుక్ చేసిన అనంతరం ఆ పార్శిల్ ను ప్రత్యేకంగా బస్సుకు అందజేయాల్సి ఉంది. ఒంగోలు నుంచి పొదిలికి ప్రతి 15 నిమిషాలకు ఒక సారి బస్ వుంది. కాని ఒంగోలు కార్గో సిబ్బంది ఆ బట్టలను చేపలను తరలించే ఐస్ బాక్సు కింద పెట్టి పొదిలికి పంపిణీ చేశారు. సోమవారం పండుగకు నూతనంగా సుమారు రూ.4,600 పైగా ఖర్చు చేసి కుట్టించుకున్న బట్టలను రంజాన్ పండుగ నాడు వేసుకుందామనుకుని సదరు ప్రభుత్వ ఉద్యోగి షేక్ జిలాని పొదిలి ఆర్టీసి పార్శిల్ సర్వీస్ వద్దకు ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. అయితే పార్శిల్ వచ్చిన వెంటనే దానిని చూసిన ఉద్యోగి జిలాని అవాక్కయ్యారు. తీవ్ర ఆవేదనకు గురయ్యారు. తెల్లటి బట్టలు కాస్తా నల్లటి బట్టలుగా మారిపోయాయి. డబ్బులు తీసుకునేందుకు ఉన్నంత శ్రద్ధ కార్గో పార్శిల్ సర్వీస్ సిబ్బంది లేదు. దీంతో ఆ బట్టలు చేపల బాక్స్ కింద రావడంతో ఆ చేపల బాక్సులో ఉన్న ఉప్పు నీరు బట్టల్లోకి చేరి బట్టలు పూర్తిగా రంగుమారిపోయాయి. ఇదేనా పార్శిల్‌ను పంపేది అని పొదిలి ఆర్టీసి కార్గో సిబ్బందిని ప్రశ్నిస్తే తమకేమి సంబంధం లేదని, ఇష్టం ఉంటే బట్టలు తీసుకోండి అని లేకపోతే మీ ఇష్టం వచ్చింది చేసుకోవచ్చని ఉచిత సలహాలు ఇచ్చారు. పండుగ రోజున తీవ్ర ఆవేదనకు గురి చేసిన కార్గో సిబ్బంది వ్యవహారం పై ఆయన త్వరలోనే వినియోగదారుల ఫోరంలో కేసు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు షణ్ముఖ వెలుగు ప్రతినిధికి తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఇలాంటి వ్యవహారాల పై స్పందిస్తారో తమకు సంబంధం లేదని మౌనంగా ఉంటారో వేచి చూడాల్సిందే..... కోర్టులో కేసు నమోదు చేసి నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బంది పై చర్యలు తీసుకుంటే తప్ప కార్గో సిబ్బంది పనితీరులో మార్పు వచ్చే అవకాశం లేదని తెలుస్తుంది. మరి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారో లేక నిద్రమత్తులో వ్యవహరిస్తారో చూడాలి మరి...!









## బందోబస్తు విధులలో అప్రమత్తంగా ఉండాలి

సీఎం పర్యటన నిమిత్తం 904 మంది పోలీసులతో పటిష్ట బందోబస్త్

ప్రతి ఒక్కరూ తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోం

జిల్లా ఎస్పీ తుషార్ డూడి



**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, మార్చి 31)**

ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నిమిత్తం మొత్తం 904 మంది పోలీసులతో పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేసామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లా ఎస్పీ సోమవారం చిన్నగంజాం మండలం కొత్తగొల్లపాలెం గ్రామంలో బందోబస్తు విధులు నిర్వహించడానికి వచ్చిన పోలీసులకు బ్రీఫింగ్ నిర్వహించారు. బందోబస్తు విధులను సెక్టార్ల వారీగా విభజించారు. మ్యాప్‌ను చూపుతూ సంబంధిత సెక్టార్లలో పోలీస్ అధికారులు సిబ్బంది నిర్వహించాల్సిన విధులు గురించి దిశ నిర్దేశం చేశారు. అనంతరం పోలీస్ అధికారులను సిబ్బందిని సెక్టార్ల వారీగా వారికి కేటాయించిన ప్రదేశాలలో వెళ్ళమని తెలిపి స్వయంగా సిఎం కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించి పూర్తిస్థాయి భద్రతా ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేసేందుకు ఏప్రిల్ 1వ తేది మంగళవారం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిన్నగంజాం మండలం పెదగంజాం పంచాయతీ పరిధిలోని కొత్త గొల్లపాలెం గ్రామంకు విచ్చేయనున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా మొత్తం 904 మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీరిలో ఒకరు అడిషనల్ ఎస్పి, ఏడుగురు డిఎస్పీలు 27 మంది సిఐలు 67 మంది ఎస్సైలు ఉన్నారన్నారు. మొత్తం బందోబస్తును 11 సెక్టర్లుగా విభజించడం జరిగిందన్నారు. బందోబస్తు విధులు పాల్గొనే పోలీస్ అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన ప్రదేశాలలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ (తరువాయి 4లో...)



# పదవీ విరమణ పొందిన పోలీస్ సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు

సుదీర్ఘ కాలం క్రమశిక్షణ, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి పదవీ వీరమణ పొందడం అభినందనీయం

ఎస్పీ ఏ ఆర్ దామోదర్





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 31)**

పోలీసు శాఖలో విశేష సేవలు అందించి పదవీ విరమణ పొందిన జరుగుమల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎ ఎస్ఐ జి శ్రీనివాసరావు, గిద్దలూరు పోలీస్ స్టేషన్ విధులులో నిర్వహిస్తున్న కెవి రమణ రెడ్డి, స్వచ్ఛంద విరమణ ఐటి కోర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న సిహెచ్.శ్రీనివాసులను సోమవారం ఎస్పీ ఏ ఆర్ దామోదర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించి ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో చేరినప్పటి నుండి నేటి వరకు ప్రజలకు సేవ చేస్తూ పదవీ విరమణ పొందడం అదృష్టమన్నారు. పదవీ విరమణ ప్రతి ఒక ఉద్యోగికి తప్పదని, ఉద్యోగంలో ఉన్నపుడు చేసిన సేవలే ఉద్యోగం అనంతరం కూడా వ్యక్తి గుర్తుండేలా మంచి పేరు ప్రఖ్యాతలు తెస్తాయన్నారు. పగలనక, రాత్రనక, పండగల సమయంలో కుటుంబానికి దూరంగా ఉండి విధులు నిర్వహించారన్నారు. పోలీస్ ఉద్యోగ నిర్వహణలో ఎంతో నిబద్ధత, అంకితభావంతో జిల్లా పోలీస్ శాఖకు అందించిన సేవలను శాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందన్నారు. సకాలంలో రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందేటట్లు అన్ని చర్యలు తీసుకుంటామని, (తరువాయి 4లో...)

# ఏప్రిల్ 2న రిలయన్స్ సీబీజీ ప్లాంట్‌కు శంకుస్థాపన



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మార్చి 31)**

రిలయన్స్ ఆధ్వర్యంలో కనిగిరి ప్రాంతంలో ఏర్పాటు చేయబోయే మొదటి కంప్రెస్డ్ బయో గ్యాస్ (సీబీజీ) ప్లాంట్ కు సంబంధించి ఏప్రిల్ 2వ తేదీ జరిగే శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్, రిలయన్స్ అనంత్ అంబానీలు సంయుక్తంగా పాల్గొంటారని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. సీబీజీ ప్లాంట్ శంకుస్థాపన ఏర్పాట్లను సోమవారం ప్రత్యేకంగా పర్యవేక్షించిన ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనతో పాటు రైతుల ఆర్థిక స్థితి మెరుగు పరచడానికి అనేక చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఇందులో భాగంగానే నిరుపయోగంగా ఉన్న భూములను సీబీజీ ప్లాంట్ల నిర్మాణంలో భాగస్వామ్యం చేస్తున్నామని తెలిపారు. కౌలుకు ఇచ్చినా రూ.4, 5 వేలు మాత్రమే వచ్చే భూములతో పాటు వేసిన పంట చేతికి కూడా రాని భూములను ఇందుకోసం గుర్తించినట్లు మంత్రి వివరించారు. ఇటువంటి భూములను కౌలుకు ఇస్తే రైతుకు రూ.31 వేలు, ప్రభుత్వ భూములకు రూ.15 వేలు వరకు ఆదాయం వస్తుందని తెలిపారు. కౌలుకు ఇవ్వక పోయినా ప్లాంట్ కు అవసరం అయిన గడ్డిని పండించి ఇచ్చినా అన్నదాతకు ఆర్థిక లాభం కలుగుతుందని పేర్కొన్నారు. అదే విధంగా ప్లాంట్ చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలకు ఉపాధి కలుగుతుందని మంత్రి గొట్టిపాటి తెలిపారు.

**500 ప్లాంట్లతో వేలాది మందికి ఉపాధి...**

**వలసలు తగ్గుముఖం..**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుపయోగమైన భూముల్లో సుమారు 500 సీబీజీ ప్లాంట్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. ప్రస్తుతం కనిగిరి ప్రాంతంలో 100 టన్నుల కెపాసిటీతో (తరువాయి 4లో...)

పాల్గొననున్న నారా లోకేష్, అనంత్ అంబానీ
ఉపయోగంలేని భూముల వినియోగంతో రైతులకు ఆర్థిక లాభం
రాష్ట్రవ్యాప్తంగా 500 ప్లాంట్ల నిర్మాణానికి ప్రణాళిక
ప్లాంట్ల నిర్మాణంతో... వేలాది మందికి ఉపాధి
ఉద్యోగాల కల్పనతో వలసలు తగ్గుముఖం
ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

# బందోబస్తు విధులలో అప్రమత్తంగా ఉండాలి







సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. సమయపాలన పాటిస్తూ నిర్దేశించిన సమయానికి విధులకు హాజరుగా ఉండాలన్నారు. హెలిప్యాడ్ వద్ద ప్రజా ప్రతినిధులను కలుస్తారని, అనంతరం లబ్ధిదారుల గృహాలకు వెళ్లి పెన్షన్లు పంపిణీ చేస్తారన్నారు. స్థానికంగా ఉన్న దేవాలయానికి వెళ్లి పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రజా వేదిక వద్దకు వస్తారని తెలిపారు. ఆ ప్రదేశాల్లో విధులు నిర్వహించే పోలీసులు కాన్వాయ్ వచ్చే సమయంలో ఎంతో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. హెలిప్యాడ్, సభా వేదిక వద్ద, పార్కింగ్ ప్రదేశాలలో, ట్రాఫిక్ దారి మళ్లించే ప్రదేశాలలో, ఇతర ముఖ్యమైన విధులు నిర్వహించే సంబంధిత అధికారులకు భద్రతాపరమైన అంశాలపై పలు సూచనలు తెలిపారు. రోప్ పార్టీ, రూఫ్ టాప్, ట్రాఫిక్ విధులు చాల కీలకమని ప్రతి క్షణం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రవేశ మార్గాలలో ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపాలన్నారు. సాధారణ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలకు సమయానికి నీరు, ఆహారం అందేవిధంగా చూసుకోవాలన్నారు. పోలీసు సిబ్బందికి వాటర్ బాటిళ్లు (లేదా) ప్యాకెట్లు అందించాలని పోలీసు అధికారులకు సూచించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని సూచించారు. బందోబస్తు విధులకు హాజరైన పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఏవైనా సమస్యలు, ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. విధులలో అలసత్వం వహిస్తే ఉపేక్షించబోమని శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, బాపట్ల, చీరాల, రేపల్లె, సీసీఎస్ డిఎస్పీలు రామాంజనేయులు, మోయిన్, శ్రీనివాసరావు, జగదీష్ నాయక్‌లు, ఎస్.బి ఇన్స్పెక్టర్ నారాయణ, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏప్రిల్ 2న రిలయన్స్ సీబీజీ ప్లాంట్‌కు శంకుస్థాపన









ప్లాంట్ నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. ప్లాంట్ల నిర్మాణానికి సుమారు 5,000 ఎకరాలను కేటాయించామన్నారు. కనిగిరితో పాటు గిద్దలూరు, మార్కాపురం, దర్శితో పాటు కొండెపిలోనూ ప్లాంట్ల నిర్మాణాలను చేపడతామన్నారు. 20 టన్నుల కెపాసిటీ కలిగిన ఒక్కో సాధారణ ప్లాంట్ నిర్మాణంతో సుమారు 250 నుంచి 500 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుందని మంత్రి గొట్టిపాటి తెలిపారు. దీనితో పనులు లేక ఆర్థిక ఇబ్బందులతో వలసలు వెళ్లే అవసరం ఆ ప్రాంత ప్రజలకు ఇకపై తగ్గుతుందని చెప్పారు. మొత్తం ప్లాంట్ల నిర్మాణాలన్నీ పూర్తయితే వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించడంతో పాటు, రైతులకూ ఆర్థిక లాభం కలుగుతుందన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో సీబీజీ ప్లాంట్ల నిర్మాణాలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. ఏప్రిల్ 2న జరగబోయే ప్లాంట్ శంకుస్థాపన ఏర్పాట్ల పరిశీలన కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటితో పాటు ఎమ్మెల్యేలు ఉగ్రనరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి, పలువురు అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

# పవిత్రతకు, త్యాగానికి, మత సామరస్యానికి ప్రతీక రంజాన్





**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మార్చి 31)**

పవిత్రతకు, త్యాగానికి, మత సామరస్యానికి రంజాన్ ప్రతీక అని, పండుగ నాడు ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేయడం సంతోషంగా ఉందని రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. రంజాన్ సందర్భంగా సోమవారం నాడు కొండపి ఈద్గాలో ముస్లింలతో కలిసి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు మంత్రి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....ఉపవాస దీక్షల ద్వారా పరిఢవిల్లిన క్రమశిక్షణ, సహెూదరత్వం, దాతృత్వం, దైవభక్తి, ఆధ్యాత్మిక చింతనల కలయిక పవిత్ర రంజాన్ మాసం. ధనిక, పేద తేడా లేకుండా ముస్లిం సోదరులందరూ మసీదుల్లో ప్రార్థనలు చేస్తారు. సాటి మానవునికి మేలు చేయాలని ఖురాన్ చెప్తోంది. కొండపిలో ఈద్గా నిర్మాణానికి నాడు టీడీపీ ప్రభుత్వం సహకరించింది. ముస్లిం మైనార్టీల అభివృద్దే కూటమి ప్రభుత్వ ధ్యేయం. బడ్జెట్లో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి రూ.5,434 కోట్లు కేటాయించాం. ఇమామ్ లు, మౌజములకు ప్రతినెలా గౌరవ వేతనం ఇస్తున్నాం. హజ్ యాత్రకు వెళ్లేవారికి ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక మసీదులు, షాదీ ఖానాలకు మరమ్మతులు చేస్తున్నామన్నారు. ఆ అల్లా ఆశీర్వాదం ఈ రాష్ట్ర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

# పదవీ విరమణ పొందిన పోలీస్ సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు





వచ్చిన డబ్బులను జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని, వారి ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని, మిగిలిన శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ తర్వాత కూడా మీరు పోలీసు కుటుంబంలో సభ్యులేనని, భవిష్యత్తులో వారికి ఏ సహాయం కావాలన్నా పోలీస్ శాఖ ఎల్లవేళలా వారికి తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే పదవీ విరమణ పొందిన సిబ్బంది యొక్క కుటుంబ వివరాలను, పిల్లల చదువుల, ఉద్యోగ స్థితిగతులను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఆర్ఐ సీతారామిరెడ్డి, ఎఆర్ఎస్ఐ తిరుపతి స్వామి, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రార్థనా మందిరాల వద్ద పటిష్ట బందోబస్తు









**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 31)**

జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది ప్రార్థనా మందిరాలు, స్థలాల వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులకు ప్రకాశం జిల్లా ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా జరుపుకునే రంజాన్ పర్వదినం పురస్కరించుకుని జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలలో భాగంగా మసీదులు, ప్రార్థనా మందిరాలు, స్థలాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు. ముస్లిం సోదరుల ప్రార్థనలకు ఎలాంటి ఆటంకాలు, అవాంతరాలు జరుగకుండా బందోబస్తు చేపట్టారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టారు. డ్రోన్ కెమెరాలతో కూడా నిఘా ఏర్పాటు చేశారు.

## కంభం ఈద్గాహ్ దగ్గర డ్రోన్ కెమెరాలతో బందోబస్తు

ముస్లింలను ఈద్గాహ్ దగ్గర ప్రేమపూర్వకంగా పలకరిస్తూ ఆప్యాయంగా ఆలింగనం చేస్తూ ఎస్ఐ నరసింహారావు ప్రేమపూర్వకమైన పలకరింపు ఎస్ఐని హత్తుకున్న పలువురు ముస్లిం సోదరులు





**(షణ్ముఖ వెలుగు, కంభం, మార్చి 31)**

పట్టణంలో ప్రసిద్ధి గాంచిన నాగులవరం రోడ్డు లోని ఈద్గాహ్ వద్ద ఎస్సై నరసింహారావు డ్రోన్ కెమెరాల సహాయంతో పోలీసు సిబ్బందితో కలిసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగుజాగ్రత్తలు తీసుకున్నారు. అనంతరం ఈద్గాహ్‌లో రంజాన్ పండుగ రోజు అధిక సంఖ్యలో ముస్లింలు నమాజ్ కొరకు ఈద్గాహ్ దగ్గరికి వచ్చి నమాజ్ చదువుకొని పేదలకు దానధర్మాలు చేస్తారు. ఎస్సై నరసింహారావు నమాజ్ కొరకు వచ్చిన ముస్లిం పెద్దలను, పిల్లలను, యువతను ప్రేమపూర్వకంగా స్వాగతిస్తూ చిరునవ్వుతో పలకరించిన తీరును చూసి ముస్లిం సోదరులు ఎస్సై నరసింహారావును అభినందనలు తెలిపారు. ఎస్సై నరసింహారావు ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కావలి పట్టణంలో ఘనంగా రంజాన్ వేడుకలు

## వేడుకలకు కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి హాజరు

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మార్చి 31)**

కావలి పట్టణంలో సోమవారం రంజాన్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కావలి పట్టణం రైల్వే రోడ్డు జామ్యా మసీదు ప్రార్థనలో కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ముస్లిం సోదరులు, సోదరీమణులు అందరికీ ఎమ్మెల్యే కావ్య రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో ముస్లిం సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

## పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల

### ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ ఓల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లస్సీ ప్యాకెట్లు పంపిణీ









(షణ్ముఖ వెలుగు, పొదిలి, మార్చి 31)
రంజాన్ పర్వదినం పురస్కరించుకొని పొదిలి పట్టణంలో ప్రత్యేక ప్రార్థనలు ముగించుకొని వచ్చిన ముస్లిం భక్తులకు పొదిలి, కొనకమెట్ల, మర్రిపూడి మండలాల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ ఓల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం లస్సీ ప్యాకెట్లు పంపిణీ చేయడమైనది. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ వేమన, యూనియన్ అధ్యక్షులు రావూరి శ్రీకాంత్, వైస్ ప్రెసిడెంట్ రాయల్, వై బాల ప్రసాద్, జి శ్రీనివాసులు, ఈదుముడి కృష్ణ, సిహెచ్ శ్రీనివాసులు, శ్రీధర్, భవ్య శ్రీ, వెంకటేశ్వర్లు, ప్రవీణ్, అభి, తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో ఘనంగా రంజాన్ వేడుకలు



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మార్చి 31)
స్థానిక పొన్నలూరు, కే అగ్రహారం, మాలపాడు, జెడ్ మేకపాడు గ్రామాలలో సోమవారం రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముస్లింల పవిత్ర రంజాన్ పండగను ముస్లిం సోదరులు ఈద్గాల వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు అలింగనం చేసుకొని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. మసీదులు, ఈద్గాల వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలు గ్రామాల్లో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. నమాజు అనంతరం స్నేహితులు బంధుమిత్రులు అలింగనాలు చేసుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## నంది అవార్డు గ్రహీత గుమ్మ పద్మజ యల్లేష్ కి ఘన సత్కారం





(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, మార్చి 31)
దోర్నాలకు చెందిన ధీరజ్ శ్రీకృష్ణ ఫౌండేషన్ పేద ప్రజలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ గుర్తింపు పొందింది. ఇటీవల ఈ సంస్థ నిర్వాహకులు గుమ్మ పద్మజ యల్లేష్ యాదవ్‌ని, మెగా హెల్పింగ్ ఫౌండేషన్ చైర్మన్ పి శిరీష రెడ్డి, బంగారు నంది అవార్డు అందచేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రధానోపాధ్యాయులు జంకె ఆవులరెడ్డి, సోమవారం తన స్వగృహంలో అవార్డు గ్రహీత పద్మజ యల్లేష్ యాదవ్‌ని ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్కాపురం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి 2003 - 2004 సంవత్సరం 10వ తరగతి పూర్తి చేసుకున్న గుమ్మా యల్లేష్ పెద్ద దోర్నాల ఎంపీపీగా 2019 ఎన్నికల్లో గెలిచి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మంచి విద్యార్థిగా పేరు పొందారని గుర్తు చేశారు. గుమ్మా యల్లేష్ యాదవ్ నా స్టూడెంట్ కావడం చాలా ఆనందంగా ఉందని ఇలాంటి పదవులు, అవార్డులు మరెన్నో పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఒంటేరు వెంకట రమణయ్య, మహేష్ రెడ్డి, సుబ్బారెడ్డి, బోరి గొర్ల రాజులు, లక్ష్మీనారాయణరెడ్డిలు పాల్గొన్నారు.

# యువత భరోసా కోసం 20 లక్షల ఉద్యోగ అవకాశాలకు సిఎం చర్యలు

### జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి





(షణ్ముఖ వెలుగు, బాపట్ల, మార్చి 31)
రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు యువత భరోసా కోసం 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నారని రాష్ట్ర సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖ మంత్రి, జిల్లా ఇన్ చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సోమవారం చిన్నగంజాం మండలం కొత్తగొల్ల పాలెం గ్రామంలో ఏర్పాట్లను రాష్ట్ర సమాచార పౌర సంబంధాల, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమాచార పౌర సంబంధాల, గృహ నిర్మాణశాఖ మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ప్రభుత్వం బాధ్యతతో పంపిణీ చేస్తుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో 64లక్షల పెన్షన్లను ప్రతినెల 1వ తేదీన ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతతో పంపిణీ చేస్తున్నారని ఆయన అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లు 3వేల నుంచి4వేల రూపాయలకు ప్రభుత్వ వచ్చిన నెలలోనే పెంచడం జరిగిందని ఆయన అన్నారు. గత ప్రభుత్వం పేదల పెన్షన్లు వెయ్యి రూపాయలు పెంచడానికి 5 సంవత్సరాలు పట్టిందని ఆయన సందర్భంగా అన్నారు. రాష్ట్రంలో ప్రతి వ్యక్తి తలసరి ఆదాయం పెంచడానికి ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారనిఅన్నారు. ప్రతి ఇంటిలో ఒక వ్యాపారవేత్తను తయారు చేయడానికి ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వాలు అప్పులు కట్టలు కట్టలు చేసినప్పటికీ తమ ప్రభుత్వం వచ్చినాక అభివృద్ధి సంక్షేమ సంక్షేమ పథకాలు ఎక్కడా ఆగకుండా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని ఆయన చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ఆయన సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరు






సాంబశివరావు, చీరాల శాసనసభ్యులు ఎంఎం కొండయ్య, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి,జిల్లా ఎస్పీ తుషార్ డూడి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఆత్మీయ ఉగాది పురస్కార్ అవార్డు అందుకున్న దండేల కృష్ణ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 31)
నాయుడుపాలెంలో జరిగిన అంబేద్కర్ విగ్రహావిష్కరణలో భాగంగా ఉగాది పురస్కార అవార్డు కృష్ణకి అందజేయడం జరిగింది. అనంతరం మాట్లాడుతూ దళిత జాతికి గత 30 ఏళ్ల నుంచి ఎనలేని సేవలు అందిస్తూ నీతిగా నిజాయితీగా తన సొంత డబ్బుతో ఎంతోమందికి సహాయం చేస్తూ సామాజిక కార్యకర్తగా అంబేద్కర్‌గా జాతి కోసం అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా తదుపరి అంబేద్కర్ ఆశయ సమాజ్ జాతీయ అధ్యక్షులుగా, మన రాజ్యం పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీగా ప్రస్తుతం మాల మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నో పదవులు అలంకరిస్తూ జాతి కోసం ముఖ్యంగా మాలల కోసం మాలలకు పెన్షన్ ఇప్పించాలని ఉద్దేశంతో గత నెల 16న ఒంగోలులో రెండు రాష్ట్రాల స్థాయిలో మాల కలల మహా జాతర కార్యక్రమాన్ని తన సొంత ఖర్చుతో కార్యక్రమాన్ని జరిపి మాలల్లో ఉన్న కళలను బయటకు తీసి మాల కళాకారులకు పెన్షన్ ఇప్పించాలని గొప్ప కార్యక్రమం చేసినటువంటి మొట్టమొదటిగా భారత దేశంలోనే మాల కళాకారులకు పెన్షన్ ఇప్పిచ్చే ఉద్యమానికి పునాది చేసినటువంటి మా అన్న ఆత్మీయుడు జాతి కోసం కృషి చేసినటువంటి దండాల కృష్ణకి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఉగాది పురస్కార్ అవార్డు రావడం ఆనందదాయకమ సినీ దర్శకుడు కిరణ్ వై తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహాసభ రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ నూకతోటి కార్తీక్, వారి మిత్ర బృందం, దారా నవీన్, పొత్తూరి భాను ప్రకాష్, నూకతోటి శ్రీహరి, మామిడి అంజయ్య, కంకణాలహరి, సురేంద్ర, తదితరులు అభినందనలు తెలియజేశారు.





## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, మార్చి 31)
సుమారు 45 నుండి 50 సంవత్సరాల వయస్సు గల ఓ గుర్తుతెలియని మృతదేహం మండలంలోని గురిజేపల్లి పొలాల్లోని ఎన్‌హెచ్ 565 పై సర్వపాలెం వంతెన వద్ద లభించింది. దీనిపై ఎస్ఐ చౌడయ్య కేసు నమోదు చేశారు. ఎవరికైనా సదరు మృత దేహానికి సంబంధించిన వివరాలు తెలిస్తే యర్రగొండపాలెం పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

## మోటూరి ఉదయం స్ఫూర్తితో మహిళా సమస్యల పై ఉద్యమిద్దాం




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 31)
మహిళా ఉద్యమనేత మోటూరి ఉదయం 23వ వర్థంతి కార్యక్రమం సోమవారం ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక ఎల్‌పీజీ భవన్లో జరిగింది. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ గుంటూరు జిల్లా కమ్మవారి పాలెంలో సంపన్న రైతు కుటుంబంలో జన్మించిన ఉదయం చిన్నతనం నుంచే స్వతంత్ర భావాలు కలిగి వుండేవారని తెలిపారు. మహిళలు వంటింటికే పరిమితమై ఉన్న ఆ కాలంలో స్వాతంత్ర ఉద్యమంలోనూ, ఆ తర్వాత ఆంధ్ర రాష్ట్రం లో మహిళా సంఘాన్ని స్థాపించడంలో ప్రధాన పాత్ర పోషించారని అన్నారు. ఆనాడు సమాజంలో వున్న మూఢభావాలకు, సనాతన సాంప్రదాయాలకు, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా స్త్రీ, పురుష సమానత్వం కోసం అనేక పోరాటాలు నిర్వహించారని అన్నారు. మహిళలకు ఆస్తి హక్కు కావాలని పోరాడి సాధించారని, అలాగే ఏపీలో మొదటి మహిళా మెడికల్ రిప్రజంటేటివ్‌గా పనిచేశారని తెలిపారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస వరకు కట్టుబడి ఉన్నారన్నారు. ఆమె అందించిన స్ఫూర్తితో మహిళా ఉద్యమాలను ముందుకు తీసుకెళదామని అన్నారు. ఐద్వా జిల్లా నాయకురాలు బి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మోటూరు ఉదయం స్ఫూర్తి తో ఐద్వా ఆధ్వర్యంలో ఒంగోలులో మోటూరు ఉదయం ట్రస్టు ఏర్పాటు చేసి మహిళలకు ఉచిత న్యాయ సలహా కేంద్రం నడుపుతున్నామని, గర్భిణీ స్త్రీలకు ప్రతినెలా మూడవ శుక్రవారం బేతూన్ నర్సింగ్ హోంలో ఆమె మనుమరాలు అయిన డా.ఉదయిని గారి సహకారంతో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. ఉదయం ట్రస్టు తరపున అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, గృహహింస స్త్రీలపై జరుగుతున్న అకృత్యాలపై మహిళలను చైతన్యం చేసేందుకు ఉదయం స్ఫూర్తితో కృషి సాగిస్తామని అన్నారు. కార్యక్రమానికి ముందుగా ఉదయం చిత్రపటానికి ఐద్వా సీనియర్ నాయకురాలు బి పెద్దగోవిందమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు యన్ మాలతి, కె రాజేశ్వరి, కె రాణి పాల్గొన్నారు.

## భారత ఆర్థిక ప్రగతికి సూచిక క్యూఐపీల పెరుగుదల

### బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మార్చి 31)
భారతదేశ స్టాక్ మార్కెట్ల బలోపేతంతో 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత సంస్థలు రికార్డు స్థాయిలో 1.33 లక్షల కోట్లను క్యూ ఐ పీల క్వాలిఫైడ్ ఇన్ స్టిట్యూషనల్ ప్లేస్ మెంట్ ద్వారా సమీకరించడం దేశ ఆర్థిక పురోగమానికి మంచి సంకేతమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి అన్నారు. ఆమె సోమవారం మాట్లాడుతూ, భారతీయ స్టాక్ మార్కెట్లలో స్థిరత్వం పెరుగుతోన్న నేపథ్యంలో ప్రముఖ సంస్థలు వేదాంత, జొమాటో, అదానీ ఎనర్జీ వంటి కంపెనీలు క్యూఐపీల ద్వారా భారీ స్థాయిలో నిధులను సమీకరించడం అభినందనీయమైన విషయమనిఅన్నారు. అలాగే, ప్రభుత్వ రంగ బ్యాంకులు 14,000 కోట్లకు పైగా నిధులను సమీకరించడాన్ని ఆమె ప్రశంసించారు. క్యూఐపీల పెరుగుదల దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి, పెట్టుబడుల వృద్ధికి దోహదం చేస్తుందని పేర్కొన్న ఆమె, భవిష్యత్తులో క్యూ ఐ పీలు, ఐపీఓల ద్వారా 3 లక్షల కోట్లకు పైగా నిధుల సమీకరణ సాధ్యమవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇది దేశ వ్యాప్తంగా కొత్త పెట్టుబడులకు, ఉపాధి అవకాశాలకు దారి తీయనుందని తెలిపారు. కేంద్రమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత ఆర్థిక వ్యవస్థ దృఢంగా ముందుకు సాగుతుందని, పెట్టుబడిదారుల విశ్వాసం పెరుగుతోందని కందికట్ల రాజేశ్వరి అన్నారు. మాకు మద్దతుగా ఉన్న ప్రజలకు, పెట్టుబడిదారులకు భవిష్యత్తులో మరింత అనుకూలమైన పెట్టుబడి వాతావరణాన్ని అందించేందుకు బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె వెల్లడించారు.

# రాజీవ్ గాంధీ విగ్రహాలను కూలిస్తే చూస్తూ ఊరుకోం




### రాష్ట్రంలో బీజేపీ ఎజెండాను అమలు చేస్తున్నారా?
### మే 21న రాజీవ్ గాంధీ వర్ధంతి నాటికి
### ప్రభుత్వ ఖర్చుతో కొత్త కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్
### షేక్ సైదా, నాగలక్ష్మి, పాలపర్తి విజేష్ రాజ్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 31)

మార్చి 29వ తేదీ ఒంగోలు పట్టణంలోని క్లాపేట వద్ద ఉన్న భారతమాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని మున్సిపల్ అధికారులు కాంగ్రెస్ పార్టీ వారికి ముందస్తు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా రోడ్డుకు అడ్డంగా ఉందని, యాక్సిడెంట్‌లు జరుగుతున్నాయని, డివైడర్స్ ఏర్పాటు చేయాలని సాకుతో జెసిబిలతో కూల్చివేయడం జరిగింది. ఈ అక్రమ కూల్చివేతను నిరసిస్తూ ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు షేక్ సైదా విలేకరుల సమావేశం నిర్వహించారు. క్లాపేట లోని రాజీవ్ గాంధీ విగ్రహం ప్రయాణికులకు వాహనదారులకు ఇబ్బందికరంగా ఉండి ఉంటే గనక కాంగ్రెస్ పార్టీ నాయకులకు తెలియజేసినట్లయితే మేమే ముందుకు వచ్చి ప్రజలకు ఇబ్బంది కలగకుండా సహకరించే వాళ్ళమని షేక్ సైదా తెలియజేశారు. ఆ విగ్రహం ఏర్పాటు చేసే సమయంలో కమిటీ సభ్యులుగా ఉన్నటువంటి వారు ఈరోజు తెలుగుదేశం పార్టీలో నాయకులుగా ఉన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు నుండి అభిప్రాయం తీసుకుని రాజీవ్ గాంధీ గారి విగ్రహాన్ని తొలగించడం ఎంతవరకు సబబు అని షేక్ సైదా ప్రశ్నించారు. రాజీవ్ గాంధీ గారు జాతీయ నాయకుడు కాంగ్రెస్ పార్టీ తలుచుకుంటే గనుక ఈ విషయాన్ని దేశవ్యాప్తంగా కూడా నిరసన కార్యక్రమాలు చేపట్టగలం. కానీ కాంగ్రెస్ పార్టీ విషయంలో సామరస్యంగా ముందుకు వెళ్లాలని నిర్ణయించుకుంది. మే 21వ తేదీ రాజీవ్ గాంధీ గారి వర్ధంతి లోపు ప్రజలకు గాని వాహనదారులకు గాని ఇబ్బంది లేకుండా ఉండేటువంటి ప్రదేశంలో రాజీవ్ గాంధీ గారి కాంశ్య విగ్రహాన్ని ప్రభుత్వ ఖర్చుతో తిరిగి ఏర్పాటు చేయాలి. లేనిపక్షంలో పిసిసి అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి గారి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నటువంటి తెలంగాణ కర్ణాటక తమిళనాడు నుండి ముఖ్యమంత్రిలు జాతీయ నాయకులతో కలిసి ఒంగోలులో భారీ నిరసన కార్యక్రమం చేపడతామని షేక్ సైదా తెలియజేశారు. అధికారులు చేసిన తప్పును సరిదిద్దుకోకపోతే ఈ విషయంపై న్యాయపోరాటానికి కూడా సిద్ధంగా ఉన్నాము అని షేక్ సైదా తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో బలహీనంగా ఉన్న ఇది జాతీయ పార్టీ అని, దేశానికి స్వాతంత్రం తీసుకొచ్చినటువంటి పార్టీ అని గుర్తుపెట్టుకోవాలని ఒంగోలు నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నాగలక్ష్మి పేర్కొన్నారు. అధికారులు కనీసం అవగాహన లేకుండా ఇటువంటి చర్యలు చేపట్టడం ఎంత మాత్రం సబబు కాదని, అధికారులు బాధ్యతగా మసులుకోవాలని చెప్పి నాగలక్ష్మి అన్నారు. భారతదేశాన పారిశ్రామికంగా అభివృద్ధి పరచడానికి రాజీవ్ గాంధీ ఎంతో కీలక పాత్ర పోషించారని పాలపర్తి విజేష్ రాజ్ అన్నారు. ఐటీ రంగంలో, టెలికం రంగంలో, పంచాయతీరాజ్ విభాగంలో అనేక సంస్కరణల ద్వారా తనదంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. ఓటు హక్కును 18 సంవత్సరాలకే కుదించి చైతన్యవంతులైన యువకులు అనేకమంది కూడా ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగం కావడానికి అవకాశం కల్పించినటువంటి వ్యక్తి రాజీవ్ గాంధీ అని పాలపర్తి విజేష్ రాజ్ అన్నారు. అటువంటి నాయకుడి విగ్రహాన్ని ఈ విధంగా అక్రమంగా తొలగించడం సబబు కాదని, వెంటనే రాజీవ్ గాంధీ గారి కాంశ్య విగ్రహాన్ని ప్రభుత్వము ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ ప్రెస్ మీట్‌లో ప్రకాశం జిల్లా లీగల్సేల్ అధ్యక్షుడు సుదర్శి రవి, ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు రసూల్, మాజీ ఎంపీటీసీ బొద్దు సతీష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పైనం మధు పాల్గొన్నారు.

# పండుగ రోజు అందరూ సంతోషంగా ఉండాలి

### వై ఎ స్సార్ టీచర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కేశవరపు జాలిరెడ్డి





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 31)

పవిత్రమైన రంజాన్ పండుగ రోజుఅందరూ సంతోషంగా ఉండాలి, ఆర్థిక ఇబ్బందులతో పండుగ రోజు ఎవరు బాధ పడకూడదు అనే ఉద్దేశ్యంతో ఉలవపాడు మండల పరిధిలో కరేడు గ్రామంలో సోమవారం వై ఎ స్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కేశవరపు జాలిరెడ్డి రంజాన్ తోఫా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పండుగ ముస్లిం లకు చాలా ముఖ్యమైన పండుగ అని ఈ పండుగ నాటి నుండి అల్లా దీవెనలు ప్రతి కుటుంబం పై ఉండాలని వారికి అంతా మంచి జరగాలని కోరారు. పండుగ రోజు అవసరం అయిన వస్తువులు మాంసం, సరుకులు అందచేసినట్టు తెలిపారు. కరేడు గ్రామంలో గత కొన్నేళ్ళుగా అన్ని కుటుంబాలకు ప్రతి రంజాన్ రోజు అందిస్తున్నామని, తర్వాత కూడా ప్రతి సంవత్సరం వారికి అండగా ఉంటామని తెలిపారు. షుమారు 60 కుటుంబాలకు ఈ తోఫా అందించారు. ప్రతి పండుగకి గుర్తుపెట్టుకుని తమకు వస్తువులు అందిస్తున్న జాలిరెడ్డికి ముస్లిమ్ సోదరులు కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ కార్యక్రమం లో కరేడు గ్రామ వైఎస్ఆర్ సిపి నాయకులు మాజీ ఎంపీటీసీ పందలపు సుందరమ్మ, మాజీ సర్పంచ్ కొక్కిలగడ్డ కృష్ణారావు, షేక్ వలి, ఖాజా, పీతా రామకృష్ణ, రామనాథం, మాల్యాద్రి, మాకా జాలయ్య, నాయుడు ఏడుకొండలు, నాంచార్లు, బ్రహ్మేశ్వర రావు, తోట నరసింహం, శరభారెడ్డి, మహేందర్‌రెడ్డి, చాపల కోటేశ్వరరావు, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మతసామరస్యానికి ప్రతీక రంజాన్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 31)

మతసామరస్యానికి ప్రతీక కగా రంజాన్ నిలుస్తోందని మతగురువులు ఉద్ఘాటించారు. పవిత్ర రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు ఒంగోలు నగరంలో ఘనంగా నిర్వహించారు. ఒంగోలు నగరంలోని కొణిజేడు బస్టాండు వద్ద ఉన్న ఈద్గాలో వేలాదిమంది ముస్లిం సోదరులు పాల్గొని ప్రార్థనలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అల్లాహ్ చూపిన శాంతి, కరుణ, దయ, సేవా మార్గంలో నడుచుకోవాలన్నారు. రంజాన్ పర్వదినం విశిష్ఠతను, అల్లాహ్ గొప్పతనాన్ని, ఖురాన్ పవిత్రత గురించి వివరించారు. ఈ ప్రార్థనలలో పాల్గొని ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రార్థన నిర్వహించి ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా ఇక్కడ ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా వన్ టౌన్ సిఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు సిబ్బంది సహకారంతో గట్టి భద్రతా ఏర్పాట్లు నిర్వహించారు.















# రంజాన్ ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ ప్రార్థనలకు హాజరైన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మార్చి 31)

నెల్లూరు విఆర్సి గ్రౌండ్స్‌లో 4 వేల మంది ముస్లిం సోదర సోదరీమణులతో ఉదయం 7.15 కు ప్రారంభమైన రంజాన్ ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ ప్రార్ధనల కార్యక్రమానికి.. వైసీపీ నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. వైసిపి 42 వ డివిజన్ అధ్యక్షులు అబ్దుల్ మస్తాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పలువురు ముస్లిం సోదరులు, నాయకులను కలుసుకొని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం చంద్రశేఖర్ రెడ్డి ప్రార్థనలకు హాజరైన ముస్లిం సోదరులకు శీతల పానీయాలు అందజేశారు.

# రంజాన్ నమాజ్ ప్రార్థనలో పాల్గొనడం సంతోషంగా ఉంది

### ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మార్చి 31)

నెల్లూరు నగరంలోని సంతపేట ఈద్గా మస్జీద్ లో రంజాన్ ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ ప్రార్ధనలకు ముస్లిం సోదరులతో కలిసి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. నెల్లూరు సంతపేట మస్ జిద్ ఈద్గాలో రంజాన్ ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ ప్రార్ధనల కార్యక్రమానికి వైసీపీ నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హాజరై ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పలువురు ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పలువురు ముస్లిం సోదరులకు చంద్రశేఖర్‌రెడ్డి శీతల పానీయాలు అందజేశారు. పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 49వ డివిజన్ ఈద్గా వద్ద రంజాన్ నమాజ్ ప్రార్ధనలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. అల్లా దయవల్ల నెల్లూరు నగర నియోజకవర్గ ప్రజలతో పాటుగా ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, వైయస్ జగన్మోహన్‌రెడ్డి తరపున ప్రార్థిస్తున్నానని తెలిపారు. ముస్లిం సోదర, సోదరీమణులు ప్రతి ఒక్కరు రంజాన్ పండుగను ఎంతో సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# ఈద్గాలో ప్రార్థనలో పాల్గొన్న చెవిరెడ్డి

### ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఒంగోలు వైసిపి పార్లమెంటు ఇన్‌ఛార్జి చెవిరెడ్డి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 31)

వైసీపీ ఒంగోలు పార్లమెంట్ ఇంచార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డి రంజాన్ పండుగ సందర్భంగా గద్దలగుంటలోని ఈద్గాలో ముస్లింలతో కలిసి ప్రార్ధనల్లో పాల్గొన్నారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ముప్పై రోజులు ఉపవాసం ఉండి అల్లా దయకోసం ప్రార్ధనలు చేస్తారని, ముస్లిం లలోని పేదలకు సాయం చేస్తారాని పేర్కొన్నారు. ఈ పండగను సుఖ,సంతోషాలతో మధ్య జరుపుకుంటారని తెలిపారు. ఒంగోలు అసెంబ్లీ ఇంచార్జి చుండూరి రవి బాబు, కార్పొరేటర్ ఇమ్రాన్ ఖాన్, నగర పార్టీ అధ్యక్షులు కఠారి





# ఆధైర్య పడవద్దు.. ఆదుకుంటాం

ఎమ్మెల్యే జూలకంటి



(షణ్ముఖ వెలుగు, మాచర్ల, మార్చి 31)
మాచర్ల 23వ వార్డులో తెలుగుదేశం పార్టీ మహిళా నేత, మాజీ కౌన్సిలర్ వీర్ల పాపమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి, అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సోమవారం స్వయంగా ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. యోగ క్షేమాలను కనుక్కొని, అందుతున్న వైద్యపరమైన వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఏమీ అధైర్యపడవద్దు అని.అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట తెలుగుదేశం పార్టీ యాదవ నాయకులు, పట్టణ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# తేనేటి విందుకు హాజరైన ఎమ్మెల్యే ఇంటూరి







(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మార్చి 31)
రంజాన్ పండుగ సందర్భంగా పట్టణ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు షేక్ సలాం ఆహ్వానం మేరకు వారి ఇంటి వద్ద జరిగిన తేనేటి విందు కార్యక్రమానికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. ముందుగా సలాం కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పట్టణ మాజీ టిడిపి అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, ఉన్నం వీరాస్వామి, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్ వడ్డెళ్ళ రవిచంద్ర, ముచ్చు శ్రీనివాసరావు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# చెస్ క్రీడతో విద్యార్థులలో ఏకాగ్రత

కుర్రిసాయి మార్కొండ రెడ్డి



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, మార్చి 31)
చెస్ క్రీడ ఆట వలన విద్యార్థుల్లో ఏకాగ్రతతో పాటు మానసిక ఒత్తిడికి కాకుండా చురుకుతనం మెదడుకు పదును పెట్టేందుకు ఎంతగానో దోహదపడుతుందని చక్రధర డిగ్రీ పీజీ కళాశాలల ప్రిన్సిపల్ కుర్రి సాయి మార్కొండ రెడ్డి అన్నారు. సోమవారం పల్నాడు చెస్ అకాడమీ కోచ్ కిరణ్ నేతృతంలో నిర్వహించిన జిల్లా స్థాయి టోర్నమెంట్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చిన్నారులు సెల్ ఫోన్ లకు దూరంగా ఉంచి, మెదడుకు మేతనిచ్చే చదరంగాన్ని నేర్పిస్తూ వారిలోని ప్రతిభ ను వెలుగు తీసేందుకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్న కోచ్ కిరణ్ కృషి అమోఘమని అన్నారు. పల్నాడు ప్రాంతంలో ఇలాంటి క్రీడలను మనం ఎంతగానో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కుర్రి అంజలి, అధ్యాపకులు ఆవుల ఆంజనేయులు, కళాశాల డైరెక్టర్ ఎం మహేష్‌రెడ్డి, అధ్యాపకురాలు ఎం కవిత, తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ బిల్లుపై అభ్యంతరాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి
రంజాన్ సందర్భంగా ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న
ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మార్చి 31)
ముస్లిం సమాజంలో వక్ఫ్ బిల్లు–2025 పై నెలకొన్న అభ్యంతరాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకుని వెళ్తామని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి నేరుగా తాను, కేంద్రానికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయల ద్వారా ఈ విషయాలను చేరవేస్తామన్నారు. తద్వారా తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వినుకొండలో ముస్లిం సోదరులు ఈద్–ఉల్–ఫితర్ రంజాన్ పర్వదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక తిమ్మాయపాలెం రోడ్ లోని ఈద్గా మైదానంలో సోమవారం నిర్వహించిన సామూహిక ప్రార్థనల్లో చీఫ్ విప్ జీవీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ముస్లింల సంక్షేమం కోసం కట్టుబడి ఉందన్నారు. ముస్లిం సోదరులకి ఎప్పుడూ తన మద్దతు ఉంటుందన్నారు. తాను 3సార్లు ఎమ్మెల్యేగా గెలవడం, ఇప్పుడు చీఫ్ విప్ కావడంతో వారి సహకారాన్ని ఎప్పుడూ మరిచి పోనన్నారు. స్థానిక ఈద్గా, మర్కజ్ మసీద్ కమిటీ వారు రూ. 40లక్షలు కావాలని అడిగారని... దానిపై మున్సిపాల్టీలో తీర్మానం చేయించి అనుమతులు కూడా తీసుకుమన్నారు. త్వరలో టెండర్లు పిలిచి ఈద్గా ప్రాంతం అభివృద్ధి చేస్తా మన్నారు. ఈద్గా అభివృద్ధి కోసం సగం ఖర్చును వ్యక్తిగతంగా ఇస్తా అన్నానని, ఆ మేరకు సహాయం చేస్తామన్నారు. అందరు పిల్లల్ని బాగా చదివించాలని పేదరిక నుంచి బయటపడేందు కు అదో మంచి మార్గంగా గుర్తించాలన్నారు. రంజాన్ మాసంలో ఉపవాసాలు ఉన్నవారందరికీ అభినందనలు తెలిపారు. ప్రార్థనల అనంతరం ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆత్మీయ ఆలింగానాలతో ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, కౌన్సిలర్లు, పట్టణ అధ్యక్షులు ఆయుబ్ ఖాన్, షమీం ఖాన్, సౌదాగర్ జానీ, గోల్డ్ కరీముల్లా, పీవీ సురేష్ బాబు, మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.





# ఆర్థిక, జీవనోపాధుల ప్రణాళికలు తయారు చేయాలి

వీవోఏలు, ఎన్యూమరేటర్‌లకు 3వ రోజు శిక్షణలో
కొండపి మండల డిఆర్‌డిఏ వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ బి గోపీనాథ్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 31)
రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన సూచనల మేరకు గ్రామస్థాయిలోని డ్వాక్రా గ్రూపుల్లో ఉన్న స్వయం సహాయక సంఘ సభ్యుల కుటుంబాలకు రాబోవు ఆర్థిక సంవత్సరమైన 2025–26 సంవత్సరానికి ఆర్థిక,జీవనోపాధుల ప్రణాళికలు తయారు చేయాలని కొండపి మండల డిఆర్‌డిఏ వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ బి గోపీనాథ్ తెలిపారు. శిక్షణకు కొండపి, పెదకండ్లకుంట, జాల్లపాలెం, కట్టవారిపాలెం, పేరిదేపి మిట్టపాలెం పంచాయతీలలోని వివోఏలు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా, ఆయన మాట్లాడుతూ శిక్షణ తీసుకున్న ఎన్యూమరేటర్లు, రాష్ట్ర ప్రభుత్వం, సెర్ప్ సంస్థ వారి ఉద్దేశాలను మేరకు వారికి కేటాయించిన డ్వాక్రా గ్రూపు సభ్యురాలు నుంచి ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. సేకరించిన సమాచారాన్ని ప్రభుత్వం నుంచి విడుదలైన ఆన్ లైన్ యాప్లో నమోదు చేయాలని సూచించారు. ఈ యొక్క డేటా సేకరణ ప్రధాన ఉద్దేశం తెలియజేస్తూ డ్వాక్రా గ్రూపు సభ్యుల కుటుంబాల సమాచారం వారి ఆర్థిక జీవన స్థితిగతులు, గతంలో వారు తీసుకున్న రుణాలు, ఏర్పాటు చేసుకున్న జీవనోపాధి వివరాలు, అప్పు రికవరీలు, నిలువలు పరిశీలన చేస్తూ భవిష్యత్తులో వారికి కావలసిన అవసరాలు ఏర్పాటు చేసుకోబోయే జీవనోపాధి ఈ జీవనోపాధికి అయ్యే ఖర్చులు ఇవన్నీ కూడా ఒక అంచనా రూపంలో తయారుచేసి ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నివేదికలు తయారు వల్ల డిఆర్‌డిఏ – వెలుగు శాఖ ద్వారా స్వయం సహాయక సంఘ సభ్యుల అవసరాలను, ఒక అంచనా వేసి ప్రణాళికలు చేయుటకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా శాఖ ద్వారా స్వయం సహాయక సంఘ సభ్యుల పాటించవలసిన పంచ సూత్రాలు, చేయవలసిన గ్రూపు మరియు గ్రామ సంఘ పొదుపులు గురించి అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రతినెల వీవోఏలు వారి పరిధిలో ఉన్న గ్రూపులకు చేస్తున్న మొబైల్ బుక్ కీపింగ్ కొత్త వర్షన్ అయిందని ఈ వర్షన్‌లో గ్రూపుల వాళ్లు ఏర్పాటు చేసుకునే మీటింగ్ స్థలాన్ని జియో పెన్సింగ్ చేయాలని, గ్రూపు సభ్యుల ము ఖాలను గుర్తించి హాజరు తీసుకోవలసి ఉంటుందని తెలియజేసి, ఈ వర్షన్ లో తప్పులు లేకుండా ఖచ్చితమైన ఆర్థిక లావాదేవీలు నమోదు చేయాలని ఆదేశించారు. సీసీలు వారి వారి పరిధిలో గ్రామాల వారీగా క్వాలిటీ సమాచారం సేకరణ జరిగే విధముగా మానిటరింగ్ చేస్తూ వర్క్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు డి మల్లికార్జున, సీహెచ్ గోవిందమ్మ, కె రామానుజులు, కె రమణమ్మ, అకౌంటెంట్ కోటేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.



# ముస్లిం సోదరులకు మజ్జిగ పంపిణీ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 31)
ఒంగోలు నగరం 27వ డివిజన్ నందు రంజాన్ పర్వదిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో 3000 మంది ముస్లిం సోదరులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య



అతిథిగా పాల్గొన్న ఒకటో పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ 30 రోజులపాటు ఉపవాస దీక్ష ను చేపట్టడమే గాక, పేదలకు కొనసాగి రంజాన్ పండుగను ముస్లిం సోదరులు అత్యంత వైభవంగా జరుపుకుంటారన్నారు. ప్రేమ,కరుణ ,త్యాగాలకు ప్రతిరూపమైన రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిన నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధితులకు శివశక్తి ఫౌండేషన్ ఆర్థిక సాయం

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మార్చి 31)
వినుకొండ నియోజకవర్గం బొల్లాపల్లి మండలం గరికపాడు, వినుకొండ మండలం పెదకంచర్లలో ఇటీవల జరిగిన దుర్ఘటనల్లో అగ్నిప్రమాదాల వల్ల సర్వం కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కుటుంబ ఆధ్వర్యంలోని శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ఆపన్న హస్తం అందించింది. ఇళ్లు, ఆస్తులు బూడిదై నష్టపోయిన బాధితులకు ఆర్థిక సాయంతో పాటు జీవనాధారాన్ని కల్పించేందుకు అండగా నిలిచింది. పెదకంచర్ల గ్రామానికి చెందిన ఒంటేరు బాలకోటేశ్వరరావు కుటుంబం అగ్నిప్రమాదంలో తీవ్రంగా నష్టపోయింది. వారికి ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఫౌండేషన్ తరపున స్వయంగా సాయం చేశారు. వంట సామగ్రి, నిత్యావసర వస్తువులు, బియ్యం, దుస్తులతో పాటు ఆర్థిక సహాయం అందజే శారు. గరికపాడు గ్రామానికి చెందిన కొక్కర వీరాంజీ కుటుంబానికి కూడా రూ. 5,000 నగదు సాయంతో పాటు వంట సామగ్రి, బియ్యం, దుస్తులు, నిత్యావసర సరుకులు అందించారు. వారికి ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ లీలావతి స్వయంగా ఈ సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ అగ్నిప్రమాద బాధితులకు అండగా నిలవడం కనీస బాధ్యత అని, శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ద్వారా ఈ కుటుంబాలకు సాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. కష్ట సమయంలో అండగా నిలిచిన జీవీ ఆంజనేయులు, శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్‌కు బాధిత కుటుంబాలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జునరావు, మాదాల చిరంజీవి, రామినేని ఆంజనేయులు, ముత్తినేని హనుమంతరావు, దొడ్ల నాగరాజు మాజీ సర్పంచ్, ముక్కంటి వైస్, ముక్కంటి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.





# పేదలకు తోపుడు బండ్లు పంపిణీ చేసిన మంత్రి నారాయణ సతీమణి రమాదేవి





**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మార్చి 31)**
గోమతీనగర్‌లోని కాంపు కార్యాలయంలో పేదలకు తోపుడు బండ్లను రాష్ట్ర పురపాలక శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి పంపిణీ చేశారు. చిరు వ్యాపారాల కోసం సహాయం కోరిన కార్యకర్తలకు ఆర్థిక చేయూత అందజేశారు. తొలుత ముస్లిం సోదర సోదరీ మణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు సూచనలతో బడుగు ,బలహీన వర్గాలకు చెందిన వారికి మంత్రి నారాయణ ఆర్థిక చేయూత అందిస్తున్నారు. తోపుడు బండ్లు బాడుగకు తీసుకొని వ్యాపారాలు చేసే వారికి మంత్రి నారాయణ అండగా నిలవాలని సంకల్పించారు. సొంతనిధులతో విడతల వారీగా తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్నారు. ఈ విడతలో 15 మంది పేదలకు బండ్లు పంపిణీ చేయటం జరిగింది. ఎన్నికలు అయిపోయాయి ,గెలిచేశామని నారాయణ సార్ అనుకోలేదు. ఎన్నికల్లో శ్రమించిన వారికి అండగా నిలవాలని భావించారు. కార్యకర్తలకు ఏడాదికి 10 కోట్లరూపాయల సొంత నిధులు కేటాయిస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట మీద నిలబడ్డారు. సహాయం కోరిన కార్యకర్తలకు చిరు వ్యాపారాలు చేసుకొనేందుకు విడతల వారీగా ఆర్థిక సహకారం అందిస్తున్నారు. ఈ విడతలో 42 మంది కార్యకర్తలకు ఆర్థిక చేయూత అందించటం జరిగింది. నెల్లూరు నగర సమగ్రాభివృద్ధికి నారాయణసార్ అహర్నిశలు శ్రమిస్తున్నారు. అత్యధిక మెజార్టీతో తనను గెలిపించిన ప్రజల ఋణం తీర్చుకొనేందుకు పరితపిస్తున్నారని పొంగూరు రమాదేవి పేర్కొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టిన సిఐ మల్లిఖార్జున్



**(షణ్ముఖ వెలుగు, కంభం, మార్చి 31)**
మండలంలోని తురిమెళ్ల రోడ్డులో కంభం సర్కిల్ సిఐ మల్లికార్జున్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగరాదని, అలాగే మద్యం తాగి వాహనాలు నడపరాదని తెలిపారు. అనంతరం రోడ్డు ప్రమాదాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ మల్లికార్జున మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, మద్యం సేవించి పట్టుబడితే వారికి జరిమానా లేదా జైలు శిక్ష ఒక్కొక్కసారి రెండు పడవచ్చు అని కంభం మండలం సీఐ మల్లికార్జున స్పష్టం చేశారు.

## ముస్లిం భక్తులకు 3000 లస్సీ ప్యాకెట్లు అందజేత






**(షణ్ముఖ వెలుగు, పొదిలి, మార్చి 31)**
రంజాన్ పండుగ సందర్భంగా పొదిలిలో 1984-85 పదో తరగతి బ్యాచ్ చదువుకున్న వారు ముస్లిం భక్తులకు ప్రార్ధనా మైదానంలో 3,000 లస్సీ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కల్లం వెంకట సుబ్బారెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, ముల్లా జాకీర్, ఫిరోజ్, షేక్ రసూల్ మహమ్మద్, ఇతర 84-85 బ్యాచ్ ఆ నాటి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన వారందిరకీ వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



# ముస్లిం మహిళల సాధికారతే లక్ష్యం

**మీ సమస్యలన్నీ సెప్టెంబర్ నాటికి తీరుస్తా**
**జెండా చెట్టుతో విడదీయరాని బంధం మాది**
**పవిత్ర రంజాన్ సందేశం అందించిన ఎమ్మెల్యే జూలకంటి**

**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, మార్చి 31)**
పేద ముస్లీం మహిళలకు స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తోందని మాచర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురష్కరించుకుని సోమవారం స్థానిక పాతూరులోని ఈద్గా ప్రాంగణంలో వేలాది మంది ముస్లీం సోదర్లతో కలిసి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు జూలకంటి. అనంతరం మస్జిద్ అభివృద్ధికి రంజాన్ కానుకగా తనవంతు రూ.లక్ష నగదును విరాళంగా అందజేశారు. అనంతరం ముస్లీం సోదర్లకు రంజాన్ సందేశాన్ని ఇచ్చారు. జెండా చెట్టు బజారుతో జూలకంటి కుటుంబానికి విడదీయరాని బంధం ఉందని గుర్తు చేసుకున్నారు.నూర్ మస్జిద్, షాదీఖానా, కబరస్థాన్ నిర్మాణాలకు ఆనాటి ఎమ్మెల్యేగా ఉన్న జూలకంటి దుర్గాంబ ఎంతో కృషి చేశారని వివరించారు.

మండాది రోడ్డులో ఉన్న స్థల వివాదంపై సర్వే చేయిస్తా

రంజాన్ పర్వదినం సందర్భంగా ఈద్గాకు వచ్చిన ఎమ్మెల్యే జూలకంటికి ముస్లీంలు అనాది ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. జమ్మలమడక గ్రామంలో, మండాది రోడ్డు ఎస్కేబీఆర్ కళాశాల వద్ద ఉన్న మస్జిద్ స్థలాలు అన్యాక్రాంతం అయ్యాయని, వాటిని పరిష్కరించాలని ముస్లీంలు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన జూలకంటి. అన్ఆ స్థలాలను సర్వే చేసి.గుర్తించేలా తక్షణమే తహశీల్దార్ ను ఆదేశిస్తానని హామీ ఇచ్చారు.అలానే ఖబరస్థాన్ చుట్టూ ప్రహరి నిర్మాణానికి ప్రభుత్వ నిధులు కేటాయించి, అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈద్గా ప్రాంగణంలో బోరు వేయించి. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానని చెప్పారు.

సెప్టెంబర్ నాటికి జనాజాకు ప్రత్యేక వాహనం అందిస్తా

మాచర్ల పట్టణంలో నలుగు దిక్కులు ముస్లీంలు వ్యాపించి ఉన్నారని, వారి అంతిమ యాత్రకు కిలోమీటర్ల దూరం నుంచి ఖబరస్థాన్‌కు వాహనాలపై పార్థివ దేహాలను తీసుకురావాలంటే ఆర్థికంగా మోయరాని భారంగా ఉంటుందని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి ముస్లీంలు విన్నివించారు. దీనిపై స్పందిస్తూ ముస్లీంల జనాజాకు ప్రత్యేక వాహనం ఒకటి సెప్టెంబర్ నాటికి అందుబాటులో ఉంచుతానని హామీ ఇచ్చారు. ప్రత్యేక వాహనంతో పాటు పర్మెనెంట్ డ్రైవర్ ను, పార్థివ దేహాన్ని భద్రపరిచే ఫీజర్ ను కూడా అందజేస్తానని మాట ఇచ్చారు. త్వరలో మాచర్లలో ఉన్న ఖబరస్థాన్ ను కూడా సందర్శించి, అక్కడున్న సమస్యలపై గుర్తించి, ప్రణాళికలు సిద్ధం చేస్తానని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. రంజాన్ ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో ముస్లీం మత పెద్దలు, మాచర్ల పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## జిల్లా ఎంప్లాయిస్, పెన్షర్స్ వింగ్ అధ్యక్షుడిగా మర్లపాటి అదాం



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 31)**
మండలంలోని వీరేపల్లి గ్రామానికి చెందిన నివాసి, ఉద్యోగం చేస్తూ ,రిటైర్డ్ టీచర్‌గా,నియోజకవర్గానికి సుపరిచితులు అయిన మర్లపాటి అదాంని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని నెల్లూరు జిల్లా ఎంప్లాయిస్ , పెన్షర్సు వింగ్ అధ్యక్షులుగా నియమించిన పార్టీ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, నెల్లూరు జిల్లా అధ్యక్షులైన కాకాని గోవర్ధన్ రెడ్డికి, ఇందుకు తనపై నమ్మకంతో పార్టీని బలోపేతం చేయడానికి చేయూత నిచ్చిన మాజీ ఎమ్మెల్యే కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూధన్ యాదవ్ కి, ఉలవపాడు మండల వైయస్సార్ కాంగ్రెసు పార్టీ తరఫున ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా నెల్లూరు జిల్లా వైసీపీ ఎంప్లాయిస్, పెన్సర్లు వింగ్ అధ్యక్షుడిగా నియమితులైన మర్లపాటి అదాంకి శుభాకాంక్షలు తెలిపారు.


## రంజాన్ ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే జూలకంటి




**(షణ్ముఖ వెలుగు, మాచర్ల, మార్చి 31)**
రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం మాచర్ల పట్టణం లో పాతూరు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలో నియోజక వర్గ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ పర్వదినం మనందరిలో సహోదర భావాన్ని పెంపొందిస్తూ సమానత్వం సమైక్యత స్ఫూర్తిని చాటుదామని ఆకాంక్షిస్తూ ముస్లిం సోదర సోదరీమణులందరికీ రంజా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మత పెద్దల ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల పట్టణ టీడిపి అధ్యక్షుడు కొమెర దుర్గారావు, కజ్జం సైదయ్య, మద్ధిగపు చిన్న వెంకటరామిరెడ్డి, అలాగే ముస్లిం సోదరులు, టీడిపి నాయకులు కార్యకర్తలు, అందరు పాల్గొన్నారు.

## యువ సంగీత దర్శకుడు ఖాసింకు ఉగాది పురస్కారం రావడంపై పలువురు అభినందనలు

### రాష్ట్రస్థాయిలో పురస్కారం అందుకోవాలని ఆకాంక్ష



**(షణ్ముఖ వెలుగు, కంభం, మార్చి 31)**
కంభం మండలంలోని ఉన్నత పాఠశాలలో సంగీత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఖాసింను జిల్లా ప్రభుత్వం యంత్రాంగం ఉగాది పురస్కారంతో సత్కరించడం పట్ల పలువురు ఆనందాన్ని వ్యక్తం చేసారు. రాష్ట్ర మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి,



ఒంగోలు ఎంపీ, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ ఇతర ప్రభుత్వ పెద్దలు వారిని ఉగాది పురస్కారంతో సత్కరించటం అభినందనీయమని వారి మిత్రుడు హర్షాన్ని వ్యక్తం చేశారు. సంగీత దర్శకునిగా అనేక పాటలు రూపొందించిన కాశీం ఇటీవల బంగారు బాల్యం గీతానికి కూడా సంగీత సారథ్యం వహించి స్వయంగా పాడారు. వారి పాఠశాల విద్యార్థులను జాతీయస్థాయిలో అనేక వేదికలపై పోటీలకు తీసుకువెళ్లి ప్రథమ ద్వితీయ బహుమతులను సాధించిన ఘనత దక్కించుకున్నారు. పర్యావరణం, ఇతర సామజిక గీతాలు రూపొందించిన కాశీంకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావాలని వారి మిత్రులు ప్రజా గాయకులు నూక తోటి శరత్ బాబు, కవి యువి రత్నం, కళామిత్ర మండలి జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు, నవ్యాంధ్ర రచయిత్రల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు అరుణ, తదితరులు ఖాసింకు శుభాకాంక్షలు

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com